మార్చి-2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | మనస్సుమారి... | 02 |
| జప్పుత్వనేహ | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| ఎంజాయ్ యువర్‌సెల్ఫ్ | కె.ఇ. రాజేంద్ర | 08 |
| అడుగుడి, వెదకుడి... | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 11 |
| మహిమగల దేవుడు | సాక్ష్యము | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| రూతు | స్త్రీల కొరకు | 20 |
| స్వార్థం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-03 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**
**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726






**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# దీనమనస్సు కలిగియుండుడి

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు!

గర్వము, అహంకారము ఉన్న వారికి దీనమనస్సు ఉండదు. మనుష్యులు వారికున్న ఆధిక్యతలనుబట్టి, వారి యొక్క స్థితినిబట్టి తమ్మును తాము హెచ్చించుకుంటారు. ఎక్కువశాతం మంది తమకున్న ధనమునుబట్టి హెచ్చించుకుంటారు. అయితే ధనములేనివారు కూడా తమ్మును హెచ్చించుకోడానికి దేవుడు తమకిచ్చిన ఆధిక్యతలు కారణమవుతాయి. కొందరు తమకున్న తెలివి తేటలనుబట్టి, కొందరు చదువునుబట్టి, కొందరు తమకున్న అందాన్నిబట్టి, కొందరు తమకున్న బలమునుబట్టి గర్విస్తారు. అయితే మనము దేవున్నిబట్టి మాత్రమే అతిశయపడాలని బైబిలు గ్రంథము చెప్తుంది. 'కొందరు రథములనుబట్టియు కొందరు గుఱ్ఱములనుబట్టియు అతిశయపడుదురు మనమైతే మన దేవుడైన యెహోవా నామమునుబట్టి అతిశయ పడుదుము' (కీర్తనలు 20:7). ఈ లోకానుసారమైన ఆధిక్యతల వలన మనుష్యులకు దీనమనస్సు రాదు. ఎందుకంటే ఈ లోకంలోని ఆధిక్యతలనేవి కేవలం మనుష్యుల వలన ఘనత కలిగించేవే తప్ప దేవుని వలన కాదు. మనుష్యుల వలన ఘనత ఆశించేవారిని దేవుడు అసహ్యించుకుంటాడు. మనం దీనమనస్సు కలిగి యుండాలని దేవుడు కోరుకుంటున్నాడు. 'మనుష్యుడా, ఏది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచు కొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు' (మీకా 6:8). గర్వించేవారు న్యాయంగా నడుచుకోరు, వారికి కనికరము ఉండదు. దీనమనస్సు అసలే ఉండదు. గర్వించడమనేది సాతాను యొక్క గుణము. దేవుని మీద తనను తాను హెచ్చించుకున్నందు వలన దేవుడు సాతానును దేవుని సన్నిధి నుండి భూమి మీదకు నెట్టివేశాడు. ఆ సాతాను ఏదెను తోటలో హవ్వను మభ్యపెట్టడం వలన తనను తాను హెచ్చించుకొని దేవుని ఆజ్ఞను మీరి తినవద్దని చెప్పిన మంచిచెడ్డల తెలివినిచ్చు పండు తిని, ఆదాముతో కూడా తినిపించి పాపము చేయడం వలన వారు ఏదెను తోటలో నుండి బయటకు నెట్టివేయబడ్డారు. తద్వారా దూరమయ్యారు. గర్వహృదయులందరు త్వరగా పాపములో పడతారు. తద్వారా దేవుని సన్నిధికి దూరం అవుతారు. కాబట్టి మనం ఈ లోకంలో జీవించినంత కాలములో మనకున్న ఆధిక్యతలనుబట్టికాక యెహోవానుబట్టి మాత్రమే అతిశయపడిన యెడల మనకు దీనమనస్సు వస్తుంది. దేవున్నిబట్టి అతిశయపడువారు దేవుని కృప ద్వారానే మనము జీవించగలుతున్నామన్న వాస్తవం తెలిసికొని దీనమనస్సు కలిగి ఇతరులను ప్రేమిస్తారు. 'మీరందరు ఎదుటివాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి;దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును' (1పేతురు 5:5). మనం దీనమనస్సు కలిగి మనల్ని మనం తగ్గించుకోవడం వలన ఇతరుల ముందు చులకన అవుతామేమో అన్న భావన మనకు కలగొచ్చు. అయితే సమయం వచ్చినప్పుడు ఎవరి దగ్గర మనం తగ్గించుకొని ఉన్నామో వారి ఎదుటే దేవుడు మనల్ని హెచ్చిస్తాడు. కాబట్టి దేవుడు తగిన కాలమందు మనలను హెచ్చించునట్లు దీనమనస్సు కలిగిఉందాము.

*-ఎడిటర్, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర*

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

- కొడవటికంటి

ఇప్పుడు ఆమె గబగబా యోసేపు దగ్గరగా వచ్చింది. యోసేపు ఆమెనే చూస్తున్నాడు. యోసేపు భుజం మీద చెయ్యివేసి ప్రక్కగా జరిపి అతని ప్రక్కనేవున్న గంట కొట్టి అద్దం వైపుగా వెళ్ళింది. బానిస వచ్చి తలుపు తెరచింది.

"మజ్లీకి చెప్పు నాతో దేవాలయం రావాలని. పూజకి కావలసిన వస్తువులు సిద్ధంచేసి దానికి ఇవ్వు" బానిసతో చెప్పింది. మజ్లీ అంటే చెవిటి, మూగ బానిస. ఆమెను అవసరం వచ్చినప్పుడే ఉపయోగిస్తారు. తలుపుమూసి బానిస బయటకు వెళ్ళింది.

అనుకోకుండా, అకస్మాత్తుగా యోసేపుకు దగ్గరగా వచ్చి, యోసేపు చేయి పట్టుకొని "ఇప్పుడు నా శరీరం వేడిగా ఉన్నదా?" అని అడిగింది. అవును ఇప్పుడు ఈమె శరీరం చల్లగా ఉందేమిటి? ఇంతకు ముందు అంతవేడిగా ఉందే అనుకున్నాడు. 'లేదు' అని తలవూపాడు.

ఆమె తన చెయ్యి పట్టుకున్న చోట నుండి, చేయి వదలలేదు. అట్లాగనే చేయి పట్టుకొని చిన్న పిల్లవాడిని నడిపిస్తున్నట్లుగా వాకిలి దాక తీసికొని వెళ్ళి, చెయ్యి వదలి తలుపు తెరవమన్నట్లు సంజ్ఞ చేసింది.

యోసేపు తలుపు తెరవగానే తన బానిస, వాకిలి దగ్గరవున్న ఇద్దరు బానిసలు, ముక్తార్, మజ్లీ అందరూ తలలు నేలమట్టుకు వంచి నమస్కారం చేసారు. ఆమె గర్వంగా యోసేపు వైపు చూచింది. ఏమి చెయ్యక, ఏదో చెయ్యాలని, మాట్లాడాలని ఆనుకొని మౌనంగా ఉంది.

ఉదయం పోతీఫరుతో తనకు జరిగిన సంభాషణ అంతా చెప్పాడు. మంత్ర ముగ్ధురాలిలా విన్నది. మొదట్లో ఇంత సంపద షావుకారుల వద్ద వున్నదని తెలిసినప్పుడు నమ్మలేదు. కాని యోసేపు అబద్ధాలు, సరదాలు ఆడేవాడు కాడని గ్రహించినప్పుడు. అన్ని తలాంతులకు విలువ కట్టటంలో, ఆలోచనలతో మునిగిపోయింది. దేవాలయం వద్దకు వచ్చేటప్పటికి, నిండా జనంతో కోలాహలంగా ఉంది. అందువలన రథమును ఓను యొక్క యాజకుని ఇంటికి మళ్ళించమని చెప్పింది.

ఓను దేవాలయం యొక్క పూజారి, అంటే యాజకుని ఇల్లు, నైలునది మొదటి పాయ సముద్రంలో కలిసేచోట ఉన్నది. సముద్రంలో కలిసే ముందు నైలునది ఏడు పాయలుగా చీలుతుంది. మెంఫిస్ పట్టణానికి పదిమైళ్ళు ఉత్తరంగా నైలు మొదటి చీలిక మొదలవుతుంది. మొదటిపాయ పేరు కానోపిక్ దీనికి తూర్పుగా ఆరుమైళ్ళ దూరంలో నెల్లియోపోలీస్ వద్ద ఓను దేవాలయం ప్రాంగణానికి దాదాపు ఇరవై అయిదు ఎకరాల విశాల స్థలం ఉన్నది. ఈ ప్రాంగణమునకు నైలునది పాయ కానోపిక్‌కు ఆనుకొని ఓను యాజకుడు పోతీఫెర ఇల్లు ఉన్నది. ఫరోలకు దైవభక్తి మెండు. ఆ దైవభీతి వల్లనే నెల్లియోపోలీస్ ధన ధాన్యాలతో తులతూగుతూ ఉంటుంది. యాజకునికి మంత్రి హోదా ఉన్నందువల్ల మిక్కిలి భోగభాగ్యాలు కలిగి ఉంటాడు.

యజమానురాలు రథం దిగుతుంటే యాజకుడైన పోతీఫెర, అతని భార్య ఎదురు వచ్చి, ఇంట్లోకి స్వాగతం పలికారు. ఇంట్లోకి వస్తుంటే ముందు ప్రాంగణంలో పదిహేడు సంవత్సరాలకన్యకవారికిఎదురైయజమానురాలికి వందనం చేస్తుంటే, తన యజమానురాలు ఆ అమ్మాయిని తన అక్కున చేర్చుకొని ప్రేమగా ఆసెనత్ అంది. యోసేపు కూడా ఆసెనత్ అని తనలో తాను గొణుక్కున్నాడు. మంచి పేరు అనుకున్నాడు. యజమానురాలు ఆసెనతుని కౌగిలించుకొనినప్పుడు తెలుపు, పసుపుతాళ్ళు పెనవేసుకున్నట్లుగా ఉన్నది. ఆసెనతు తెల్లని తెలుపు. సన్నగా ఉండి తన వయస్సుని ఇంకా తగ్గించి కనబడుతున్నది. పోతీఫెర వచ్చి, తనని ఆదరంగా లోనికి తీసికొని వెళ్తుంటే ఆసెనతు వచ్చి వంగి నమస్కారం చేసింది. కాని యజమానురాలు ఆమెని వారించి

చెవిలో ఏదో చెప్పింది. అంటే ఆసెనతు తనని తన యజమానిగా భావించినదన్న మాట. తన యజమానురాలు కూడా కొంచెం సిగ్గుపడినట్లుగా కనిపించింది. చిన్నగా నవ్వుకుంది.

తిరుగు ప్రయాణంలో బంగారం కొనాలన్న ఆలోచనను ఆమె నిరాకరించింది. తర్వాత యజమానురాలు తన వైపు గర్వంగా చూచింది. 'చూసావా, నా చూపు పడితే మనుష్యులు ఎలా భయపడతారో? అయినా నేను నీకెంత విలువ ఇస్తున్నానో' అన్నట్లుగా ఉంది ఆమె చూపు.

అందరూ కలసి యజమానురాలి వెనుకనే చిన్నగా మెట్లు దిగుతుంటే ఆమె వెనక్కు తిరిగి యోసేపును చూచి, "మీరు మరీ అంతదూరంగా ఉంటే, నేను మీతో ఎట్లా మాట్లాడాలి? పెద్దగా అరవాలా?" అంది. యోసేపు ప్రక్కనే వున్న ముక్తార్ వైపు చూచాడు. అతను యోసేపు వైపు చూచాడు. 'ఆమెకు భయపడవెందుకు?' అన్నట్లుగా ఉంది. 'మన యజమానునితో అయితే పరవాలేదు గాని ఆమెకు కోపం తెప్పించి, ఎవరు బ్రతుకుతారు' అన్నట్లుగా ఉంది ఆ చూపు. ఇప్పుడు యోసేపు ఆమె ప్రక్కనే నడుస్తున్నాడు. ఆమె వేసే ప్రతి అడుగు వెనక నుండి బానిసలు లెక్కపెడుతున్నట్లు చూస్తున్నారు.

బయట రథం వెనకాల నలుగురు రౌతులు ఉన్నారు. నాలుగు రథాశ్వాలు ఉన్నాయి. ఆమెకు పూర్తి భద్రత ఉన్నది. మజ్లీ రథం తలుపులు తెరిచింది. ఆమె రథం లోపల ప్రవేశించిన తర్వాత ఆమె ఎక్కిన రథం మెట్లు మడతపడి లోపలకు ముడుచుకొన్నవి. ఇంట్లో మెట్లు ఎక్కినంత తేలికగా రథం మెట్లు ఎక్కడానికి వీలుగా ఉన్నవి. తర్వాత మెట్లు అవసరం లేకుండానే యోసేపు రథం ఎక్కి ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. ఈ రథం పోతీఫరుకు ఫరో బహుమానంగా ఇచ్చాడు. చాలా పెద్దది. విశాలమైనది. ఇనుముతో తయారు చేయబడినప్పటికి లోపల దూదికంటే మెత్తగా ఉంది. రెండువైపులా నాలుగు కిటికీలు, తెరలు కట్టబడినవి. బయట ఎంత వేడిగా ఉందో, లోపల అంత చల్లగా ఉంది. లోపలి నుండి బయటప్రపంచమంతా కనబడుతుంది. కాని బయట వాళ్ళకు, లోపలివారు కనబడరు. లోనివారు బయటకి కనబడనంత పల్చని తెరలు కట్టబడినవి. రథం బయలుదేరింది. లయబద్ధంగా గుర్రాల అడుగులకి అనుకూలంగా రథం మెత్తంగా కదులుతున్నది. నిజంగా రథ నిర్మాణకుని మెచ్చుకోవలసిందే. ఎంతదూరం, ఎటువంటి ప్రయాణం చేసినా, ఏ బాటలోనైనా శరీరం అలసిపోనట్టి విధంగా నిర్మించారు అనుకున్నాడు. మజ్లీ తలుపుకు బిగించిన బల్లలాంటి దాని మీద కూర్చుని చేతిలో పూజ ద్రవ్యాలువున్న బుట్ట పట్టుకుని ఉంది. మజ్లీ వయస్సు ఇరవై రెండు సంవత్సరాలు ఉండవచ్చును. ఆమె తన మొదటి యజమానిని మోసం చేసిన బానిస. అందువల్లనే ఆమె నాలుక కోయబడి చెవిటి దానిగా శిక్షించి అమ్మివేశారు. పోతీఫరు ఆమెను ఒక సంవత్సరం క్రితం కొన్నాడు.

యోసేపు ఆలోచిస్తూ యజమానురాలి వైపు చూచాడు. ఆమె తన వంకే కన్నార్పకుండా చూస్తుంది. యోసేపు నవ్వాడు. ఎందుకు నవ్వాడో తనకే తెలియదు. యోసేపు నవ్వును చూసిన ఆమె కళ్ళు మెరిశాయి. ఓను యాజకుని ఇంటి వద్ద నుండి వచ్చేటప్పుడు అన్యమనస్కురాలైనట్లుగా కనిపించింది. మాటిమాటికి యోసేపు వైపు చూస్తూ, ఆలోచిస్తున్నట్లుంది.

ఇంటికి వచ్చిన తర్వాత తన గదిలోనికి వెళ్ళింది. యోసేపు బయట గదిలో కూర్చొని ఆలోచిస్తున్నాడు. ఇక ఇంటికి వెళ్ళి అక్షాపుకి కబురు చెయ్యాలి అని అనుకుంటున్నాడు. ఇంతలో రెండు చేతులు తన వెనుక నుండి వచ్చి, తన బుగ్గల మీద నిమరటం చూసి అదిరిపడ్డాడు. లేచి నిలుచున్నాడు. తల తిరిగినట్లుగా అయింది. ఎవరు లోపలికి రారు. అయినా చూస్తారని కాదు ఈ భయం. తనకు తెలియకుండానే, తన యజమానురాలి వైపు చూడకుండానే, తలుపు తెరచుకొని గబగబ తన గదిలోనికి వచ్చి పడ్డాడు. చాలాసేపటి వరకు ఏమి ఆలోచించలేదు. ఇంతకు ముందు ఆకలిగా ఉన్నది. ఇప్పుడు ఆకలి చచ్చిపోయింది.

"ఆమె ఎందుకు ఇలా చేసింది?"

"....ఇందులో తన పాత్ర ఎంత వరకు?" తను ఆమె అందానికి ఈ రోజు కొంచెం చలించిన మాట వాస్తవమే. కాని ఆ విషయం ఆమెకు ఏ మాత్రం తెలియనియ్యలేదు. ప్రకృతిని చూచి, ఆనందించినట్లుగా ఆమె అందాన్ని చూచి

భ్రమించిన మాట వాస్తవమే. కాని ఆమెకి ఆ సంగతి తెలియనియ్యలేదు. తన కనుదృష్టిని నా మీద నుండి ప్రక్కకు తొలగించకుండా కాపాడిన నా తండ్రి దేవుని చూపు ఇప్పుడు ప్రక్కకు తొలిగిందా? అలా ఎన్నటికి కాదు. తనకు తెలియకుండానే తను ఊహించిన దానికన్నా, కోరుకొనిన దాని కన్నా, ఎక్కువగా అనేక ఈవులనిచ్చిన దేవుని దృష్టిలో, తను నిందారహితునిగా ఉన్నాడు. ఇక ముందు కూడా ఇటువంటి శోధనల్లో తను తట్టుకొని నిలువబడగలడా? ప్రాణం అలసిపోయినట్లుగా ఉంది.

ఎప్పుడు నిద్ర పోయాడో తెలియదు తనకు మెలుకువ వచ్చేటప్పటికి బానిస లోపలికి వచ్చి, “పోతీఫరుగారు అరగంట క్రితం తమరికి కబురు చేశారు. మీరు నిద్రపోతున్నారని తెలిసి లేపవద్దన్నారు” అని చెప్పాడు.

యోసేపు గబగబా ముఖం కడుక్కొని పోతీఫరు గదికి వెళ్ళాడు. యోసేపు ముఖం చూసి “ఏమిటి అలా ఉన్నావు. ఒంట్లో బాగాలేదా!” అని అడిగాడు పోతీఫరు. బాగున్నదని చెప్పి, చేతులు కట్టుకుని నిలుచున్నాడు యోసేపు. “మీరు ఉదయం ఓను దేవాలయముకు వెళ్ళారు కదా! మరలా ఈ సాయంకాలం అమ్మగారిని తీసుకువెళ్ళాలి. రాత్రికి భోజనం అక్కడే. నేను అక్కడికి వస్తాను” అని చెప్పి బయటకు వెళ్ళాడు. అమ్మగారు పిలుస్తున్నారని బానిస వచ్చాడు. యోసేపు నిద్రపోతున్న వాడిలాగ నీరసంగా నడుస్తూ అమ్మగారి గదివైపు వెళ్ళాడు. యజమానురాలు సిద్ధపడి ఉంది.

“ఇందాక సెలవు తీసుకోకుండానే వెళ్ళిపోయారేంటి? మనలను అంటే అయ్యగారిని, మనలను ఆసెనతు వాళ్ళు భోజనానికి ఆహ్వానించారు. ముఖం ఏంటి అలా పీక్కొని పోయింది. ఇలా కూర్చో” అని లోనికి వెళ్ళి స్వయంగా ద్రాక్షారసం గ్లాసు నిండా తీసుకొని వచ్చి ఇచ్చింది. ఒకవేళ తీసుకొనకపోతే బలవంతంగా త్రాగిస్తుందేమోనని భయ మేసింది. అయినా దేవుడు ఈ పరిస్థితిలో నుండి తప్పక తప్పిస్తాడని నమ్మకం ఉంది. గ్లాసు పూర్తి చేసి బల్లమీద ఉంచాడు. యజమానురాలు గ్లాసు తీసుకొని వెళ్ళడానికి బానిసని పిలువలేదు. ఆమె స్వయంగా వచ్చి గ్లాసుని తీసుకొని యోసేపు చెయ్యి పట్టుకొని నిలబెట్టింది. “యోసేపు కొంచెం వెనక్కు జరిగి మీకు ఒక విషయం చెప్పాలి. అలా కూర్చుంటారా?” అని ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు. అంత దీనంగా, అతని ముఖం చూచిన యజమానురాలు వెంటనే ఎదురుగా కుర్చీలో కూర్చున్నది.

“ఇది మా కుటుంబ కథ” అని ఆమె వైపు చూచాడు. ఆమె ఉత్సాహంగా నవ్వింది. యోసేపు మోకాలు మీద చెయ్యి వేసి చెప్పండి అంది. యోసేపు నిదానంగా, మర్యాదగా ఆమె చెయ్యి ప్రక్కకు తీసి, “మా తాతగారి తండ్రిపేరు అబ్రాహాము. ఆయన ఊరు అను మెసపటోమియాలో నివసించేవారు. ఒకరోజు దేవుడు అబ్రాహాము గారితో ‘నీవులేచి నీ దేశమునుండి బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్పచేయుదును. అని చెబితే, ఆయన బయలుదేరి దక్షిణ దేశముతట్టు వచ్చినపగిడు ఆ దేశములో కరువు వచ్చింది. కనుక ఆ దేశంలో కరువు భారంగా ఉన్నందున అబ్రాహాముగారు ఈ ఐగుప్తు దేశంలో నివసించుటకు ఈ నైలునది ప్రాంతానికి వచ్చాడు” అని చెప్తుంటే యజమానురాలు అందుకొని... **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**
Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

17

(దావీదు జీవిత చరిత్ర)

**- కొడవటికంటి**

"బెన్యామీనీయులారా! ఆలకించుడి" అన్నాడు.

అందరూ ఆదుర్దాగా ఉన్నారు. సౌలు ముఖంలో విసుకు, కోపం కనబడుతున్నది. ఇంతకు ముందు సౌలును అమితముగా ప్రేమించిన వారే ఇప్పుడు అతని మీద అంత గౌరవము చూపటము లేదని సౌలుకు తెలుసు. ఇప్పటికి పాతిక సంవత్సరాల క్రితం బేతావెను దగ్గర ఫిలిష్తీయులతో జరిగిన యుద్ధంలో తాను జనులచేత దేవునికి చేయించిన ప్రమాణమును యోనాతాను తనకు తెలియక మీరినందున తాను దేవుని యెడల ఎంత భక్తిపరుడో ప్రజలయందు నిరూపించుకోవాలని యోనాతానుకు మరణదండన విధించినందున ప్రజలందరూ తనకు ఎదురు తిరిగారు. అప్పటి నుండి ప్రజలలో తాను తక్కువ వాడైనట్టుగా యోనాతాను గౌరవించబడుతున్నాడు.

''యెష్షయి కుమారుడు మీకు పొలమును, ద్రాక్షాతోటలను ఇచ్చునా? మిమ్మును సహస్రాధిపతులుగాను శతాధిపతులుగాను చేయునా?" అని చుట్టూ చూచి "మీరెందుకు నా మీద కుట్ర చేయుచున్నారు?" అని ఎదోమీయుడైన దోయేగు వైపు పలకరింపుగా చూసాడు. "నా కుమారుడు యెష్షయి కుమారునితో నిబంధన చేసిన సంగతి మీలో ఎవడునూ నాకు తెలియచేయలేదే?" అని అంటూ ఇటు నడిచి "నా కొరకు పొంచి యుండునట్లుగా, నా కుమారుడు, నా సేవకుని పురికొలిపినను నా నిమిత్తము మీలో ఎవనికి చింత లేదే?" అని దోయేగు వైపు చూచాడు.

''యెష్షయి కుమారుడు పారిపోయి నోబులోని అహీటూబు కుమారుడైన అహీమెలెకు దగ్గరకు రాగా నేను చూశాను" అని తలవంచి నమస్కారం చేశాడు దోయేగు.

"తర్వాత" అన్నాడు సౌలు.

"అహీమెలెకు అతని పక్షముగా యెహోవా యొద్ద విచారణ చేసి ఆహారమును ఫిలిష్తీయుడై గొల్యాతు ఖడ్గమును అతనికిచ్చెను" అన్నాడు దోయేగు.

"సరే నీవు వెళ్ళి ఆ యాజకుని, అతని తండ్రి ఇంటివారందరిని తీసికొనిరా" అని నలుగురు సైనికులను కూడా పంపించాడు. నోబు రామాకు రెండు మైళ్ళలోపునే ఉన్నందున దోయేగు యాజకులను తీసికొని తొందరలోనే రామాకు వచ్చాడు.

దోయేగు రాగానే "అహీటూబు కుమారుడా" అన్నాడు సౌలు. "చిత్తము నా ఏలినవాడా" అని అహీమెలెకు వంగి నమస్కరించాడు.

"నీవు యెష్షయి కుమారునికి ఆహారమును, ఖడ్గమును ఇచ్చి అతని పక్షమున దేవుని యొద్ద విచారణ చేసి అతడు నా మీదికి లేచి నేడు జరుగుచున్నట్లు పొంచి యుండుటకై అతడును, నీవును జతకూడితిరేమి" అన్నాడు సౌలు.

"రాజా! రాజునకు అల్లుడై నమ్మకస్తుడై ఆలోచన కర్తయై, నీ నగరిలో ఘనత వహించిన దావీదు వంటివాడు నీ సేవకులలో ఎవడున్నాడు?" అహీమెలెకు ఏ మాత్రం తొణకకుండా మాట్లాడుతుంటే చుట్టు ఉన్న ప్రజలు సంతోషించారు.

"అతని పక్షంగా నేను దేవుని యొద్ద విచారణ చేయుట, నేడే ఆరంభించితినా?" అని ప్రశ్నించి కొంచెం ఆగి "నా మీదను నా తండ్రి ఇంటి వారందరి మీదను ఈ నేరము మోపకుందునుగాక. ఈ సంగతిని గూర్చి కొద్ది గొప్ప ఏమియు నీ దాసుడనైన నాకు తెలిసినదికాదు" అన్నాడు అహీమెలెకు.

"అహీమెలెకు" అన్నాడు కోపంగా. రాజు ముఖం జేవురించింది. "నీకును, నీ ఇంటి వారందరికిని మరణం నిశ్చయం'' అని అరిచాడు. యాజకులు ఎవ్వరూ భయపడినట్లుగా లేరు.

సౌలు గబగబ వెళ్ళి పిచుల వృక్షం క్రింద తన ఆసనం మీద కూర్చున్నాడు. చేతిలో ఈటె పట్టుకొని తన వెనుక నిలబడి వున్న సైనికులకు సైగ చేసాడు. వారందరూ వచ్చి

సౌలు ఎదురుగా నిలుచున్నారు.

యాజకుల వైపు ఈటె చూపిస్తూ "యెహోవా యాజకులగు వీరు, దావీదుతో కలసినందునను, అతడు పారిపోయిన సంగతి తెలిసియు నాకు తెలియజేయకపోయి నందుననూ  మీరు వారి మీద పడి చంపుడి" అన్నాడు సౌలు.

అయితే ఆ సైనికులలో ఒక్కరు కూడా కదలలేదు. రాజు మరలా అదే ఆజ్ఞ ఇచ్చాడు. ఆ సైనికులలో పెద్ద అయినవాడు తలవంచి "వారు దేవుని యాజకులు" అన్నాడు చిన్నగా.

సౌలుకు రెండవసారి ప్రజల మధ్య అవమానం ఎదురైంది. ఈ ప్రజలు అందరిదీ అదే ఉద్దేశం అని గ్రహించాడు. ఈ బెన్యామీనీయులలో ఎవరు యాజకుల మీద చెయ్యి వెయ్యరని తెలుసు. దోయేగు వైపు చూచాడు.

దోయేగు ముందుకు వచ్చి తలవంచి పైకెత్తి "ఆజ్ఞ" అన్నాడు. సౌలు తన ఈటె యాజకుల వైపు చూపించాడు. అంతే దోయేగు నరరూప రాక్షసుడయ్యాడు. అరగంటలో ఎనభై అయిదుగురి యాజకుల రక్తముతో నేల తడచి పోయింది.

హారెతు అరణ్యంలో తూర్పున ఉన్న గుహలో ఉంటున్న షెలోమితుకి ఆరోగ్యం బాగాలేదని తెలిసి అతని చూడటానికి వెళ్ళాడు దావీదు. అంతలో మహాని అనే అనుచరుడు పరుగున వచ్చి, "మీ కొరకు అబ్యాతారు అనే యాజక పుత్రుడు వచ్చాడు. అతను చాలా అలసి ఉన్నాడు. మీ నివాసంలో కూర్చుండబెట్టి వచ్చాను" అన్నాడు.

దావీదు బయటకి వచ్చి గబగబ నడుస్తూ తన నివాసం వైపు వస్తుంటే అబ్యాతారు దావీదును దూరంలో చూచి పరుగెత్తుతూ వచ్చి దావీదును కౌగిలించుకొని ఎలుగెత్తి ఏడవటం మొదలు పెట్టాడు. దావీదుకు ఏమి అర్థం కాలేదు. అబ్యాతారును ప్రక్కనున్న బండమీద కూర్చోపెట్టి తనూ ప్రక్కన కూర్చున్నాడు.

"నోబులో ఒక్క మానవజీవి కూడా లేదు" అన్నాడు ఏడుస్తూ. "ఏమైంది?" లేచి నిలబడి మళ్ళీ కూర్చుని "ఏమైంది అబ్యాతారు  ఏమైంది" అన్నాడు.

"నిన్న ఉదయం మా తండ్రి మా కుటుంబంలోని యాజకులు ఎనభై అయిదుగురిని రామాలో సౌలు ఆజ్ఞ చేత దోయేగు చంపివేసి సాయంకాలం నోబు వచ్చి, నోబు కాపురస్తులను, పశువులను అన్నిటిని కత్తివాత హతం చేసాడు. నేను తప్పించుకొని పారిపోయి వచ్చాను" అని ఏడుస్తూనే ఉన్నాడు అబ్యాతారు.

దావీదు ఏమి మాట్లాడలేదు. అబ్యాతారును తడుతూ ఒకసారి లేచి నిలుచుని కత్తి ఒరలో నుండి తీసి కొంచెంసేపు నిలుచుని మరల కత్తి ఒరలో పెట్టాడు. కళ్ళ వెంబడి నీరు కారుస్తూ ఉన్నాడు.

"ఆ దినమున ఆ ఏదోమీయుడు, దోయేగు అక్కడనున్నందున వాడు సౌలుకు నిశ్చయముగా సంగతి తెలుపునని నేననుకొంటిని" అంతలో షిలోమితు కుమారుడు అక్కడికి వచ్చాడు.


"నీ తండ్రికి ఇప్పుడు ఎలా ఉంది?" అన్నాడు దావీదు ఆ పది సంవత్సరాల పిల్లవాని చెయ్యి పట్టుకొని. "బాగుంది, లేచి కూర్చున్నాడు" అన్నాడు. "నేను కొంచెంసేపు ఆగి వస్తాను బాబు నువ్వు వెళ్ళు" అన్నాడు.

ఆ అబ్బాయి వెళ్ళిపోయిన తర్వాత అబ్యాతారు భుజం మీద చెయ్యివేసి నీ తండ్రి ఇంటి వారికందరికి మరణము రప్పించుటకు నేను కారకుడనైతిని గదా! నీవు భయపడక నాయొద్ద నుండుము. నా యొద్ద నీవు భద్రముగా నుందువు. నా ప్రాణము తీయజూచువాడును,  నీ ప్రాణము తీయ చూచువాడును ఒక్కడే" అని లేచి అబ్యాతారును వెంట బెట్టుకొని తన బస యొద్దకు నడిచాడు.

అదుల్లాము గుహలో చేరినప్పుడు తన దగ్గర నాలుగు వందల మంది సహచరులు హారెతుకు వచ్చిన తర్వాత దాదాపు ఆరువందలమంది అయ్యారు. సాయంకాలం మసక చీకటి పడుతున్నప్పుడు అబీషై గుఱ్ఱం మీద వచ్చి గుఱ్ఱం దిగి పరుగున దావీదు దగ్గరకు వచ్చి "కెయీలా మీద ఫిలిష్తీయులు దాడిచేసి కళ్ళముల మీద ధాన్యమును దోచుకుంటున్నారు" అని చెప్పాడు. **(సశేషం)**



# 'ఎంజాయ్ యువర్‌సెల్ఫ్'



'ఎంజాయ్, ఎంజాయ్, ఎంజాయ్' అంటూ ప్రపంచమంతా ఎంజాయ్‌మెంట్‌లో మునిగి తేలుతుంది. 'అనుభవించు రాజా' అనేది ప్రతిఒక్కరి నినాదమైపోయింది. ఒక్కొక్కరు ఒక్కోరకంగా ఎంజాయ్ చేస్తుంటారు. కొంతమందికి తినడం, త్రాగడమే ఎంజాయ్‌మెంట్, కొంతమందికి అమ్మాయిలతో/అబ్బాయిలతో తిరగటం ఎంజాయ్‌మెంట్, కొంతమందికి డ్రగ్స్ తీసుకోవడం ఎంజాయ్‌మెంట్. ఇలా ఎవరికి ఇష్టమైన రీతిలో వారు ఎంజాయ్ చెయ్యడమే జీవితమనుకుంటుంటారు. బయటకు వెళ్తే ఎంజాయ్ చెయ్యడానికి కావలసిన సరంజామాలైన హోటల్స్, సినిమా థియేటర్స్, మాల్స్, క్లబ్బులు, పబ్బులు, పార్కులు ఒక్కటేంటి డబ్బుండాలే కానీ ప్రపంచాన్నే మరిపించేవన్నీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాయి. జీవితంలో అనుభవించడానికి ఇంతకు మించి ఇంకేమి లేవన్నట్లు, అనుభవించడమే జీవిత పరమార్ధమన్నట్లు ప్రతిఒక్కరి జీవితం సాగిపోతుంది. సరే, డబ్బున్నోళ్ళయితే ఇవన్నీ అనుభవిస్తారు, మరి డబ్బులేనోళ్ళ సంగతేంటంటారా? వాళ్ళూ తక్కువ తినలేదులేండి, తినడం, త్రాగడం, టి.వి. చూడటం, రోజంతా సొల్లు కబుర్లు చెప్పుకోవడం, ఈ రకంగా ఎంజాయ్ చేస్తుంటారు. సరే, జీవితాన్ని ఇంతగా ఎంజాయ్ చేస్తున్నారు కదా, ఏం సాధిస్తున్నారు? ఏం ఒరగబెడుతున్నారు? వారి ఎంజాయ్‌మెంట్‌లో చివరకు మిగిలేది ఏడుపులు, పెడబొబ్బలే. దేవుడిచ్చిన జీవితాన్ని దేవునికోసం కాకుండా తమ ఎంజాయ్‌మెంట్ కోసం ఉపయోగించేవారి అంతము నరకప్రాయంగా ఉంటుంది. *'యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము, నీ యౌవనకాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండనిమ్ము, నీ కోరిక చొప్పున నీ దృష్టి యొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటినిబట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకముంచుకొనుము' (ప్రసంగి 11:9).*

నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు ఎంజాయ్ చెయ్యి, అయితే దాని ఫలితం నువ్వు అనుభవించాల్సి వస్తుందని యూత్‌ని దేవుడు హెచ్చరిస్తున్నాడు. ఈ లోకములో ఉన్నవాటిని అనుభవించాలనుకొనేవాళ్ళు దానితో పాటు ఈ లోకసంబంధంగా వచ్చే కష్టాలను, బాధలను కూడా అనుభవించాల్సి ఉంటుంది. ఈ లోకములో మనం పోరాడాల్సింది ఈ ఎంజాయ్‌మెంట్ తోనే. ఎందుకంటే మన శరీరం ఈ లోకసుఖాలనే కోరుకుంటుంది. *'లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే' (1యోహాను 2:16)* శరీరం కోరుకొనే ఎంజాయ్‌మెంట్ ప్రకారం ఈ లోకంలో సుఖమైన జీవితం జీవిస్తే నరకానికి పోవడం ఖాయం. ధనవంతుడు ఈ లోకంలో తనకిష్టమైనట్లు సుఖము అనుభవించడం వలన నరకములో యాతనపడినట్లు (లూకా 16:25) చూడగలం. 'సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషించుము' అని తన ప్రాణముతో చెప్పుకొనిన వ్యక్తిని దేవుడు 'వెఱ్ఱివాడా' అని పిలుస్తున్నాడు. అంతేకాక 'నీ ప్రాణము జాగ్రత్త' అని హెచ్చరించాడు (లూకా 12:19,20). మనము కూడా మన ప్రాణముతో 'ఎంజాయ్ యువర్‌సెల్ఫ్' అని చెప్పుకుంటూ తినడానికి, త్రాగడానికి, సుఖించడానికి హోటల్స్, సినిమా థియేటర్స్, మాల్స్, క్లబ్బులు, పబ్బులు, పార్కులకి తిరగడమే ధ్యేయంగా జీవిస్తే, మనకి మనమే వెఱ్ఱివాళ్ళమని నిరూపించుకుంటున్నట్లే. మన ప్రాణాలను ఫణంగా పెట్టి దేవుడు మనకిచ్చిన ఈ శరీరాన్ని చెడ్డపనులు చేయడానికి ఉపయోగిస్తే మనం చేసే ప్రతి పనికి కలిగే ప్రతిఫలము మనమే అనుభవించాల్సి వస్తుందని గుర్తు పెట్టుకుంటే చాలు.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# అడుగుడి, వెదకుడి, తట్టుడి

"అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును తట్టుడి మీకు తీయబడును. (మత్తయి 7:7) మనకు ఏమి అవసరం అయినా, శారీరక, మానసిక, ఆత్మీయ అవసరం ఏదైనా సరే అడుగవలసింది దేవున్నే. అన్నింటికన్నా శ్రేష్ఠమైన యీవులను ఈ లోకంలో ఆయన మాత్రమే ఇవ్వగలడు. "మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగిన యెడల పాము నిచ్చునా? మీరు చెడ్డవారైయుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగియుండగా పరలోక మందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును. (మత్తయి 7:9–12), విశ్వాసంతో మనం మన తండ్రియైన దేవున్ని అడగాలి. అయితే ఎప్పుడు పొందుకుంటామంటే "మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయు చున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరకును" (1యోహాను 3:22). దేవుని ఆత్మ నింపుదల అడగవలెను."దేవా నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును" (కీర్తనలు 63:1). అన్నింటికన్నా ముందే ఇతరులను, మన సమస్యలను ఎదుర్కొనకముందే ప్రప్రథమముగా ఆయన్ని వెదికే వారముగా ఉండాలి. ఎలా వెదకాలి అంటే? "నన్ను జాగ్రత్తగా వెదకువారు నన్ను కనుగొందురు" (సామెతలు 8:12). ఎక్కడ వెదకాలి అంటే? ఆయన వాక్యపు (యేసుక్రీస్తులో) వెలుగులో వెదకాలి. ఏమి వెదకాలంటే? మొదట ఆయన (దేవుని) రాజ్యమును, నీతిని వెదకవలెను. అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:23). సమాధానమును వెదకి వెంటాడుము. సమాధానము లేని విషయాలలో నీవే మొదట సమాధానం వెదకాలి, మనుష్యులతో సమాధానం పొందాలి. "సమాధాన పరచువారు ధన్యులు. వారు దేవుని కుమారులు అనబడు దురు" (మత్తయి 5:9). ఎవర్ని వెదకాలి? మనం యేసుక్రీస్తు వలె తప్పిపోయిన గొర్రెలను (మనుష్యులను). మారుమనస్సు లేనివారిని వెదకాలి, వారికి దేవుని సువార్తను బోధించాలి, యేసును గూర్చి పరిచయం చేయాలి. ఒక స్త్రీకి పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకొంటే ఆమె దీపము వెలిగించి, యిల్లు ఊడ్చి, అది దొరకు వరకు జాగ్రత్తగా వెదికెను (లూకా 15:8). అలాగే మనం కూడా విలువైనవాటిని కాని, విలువైన వ్యక్తులనుకాని పోగొట్టుకున్న ప్పుడు మనం కూడా దేవుని ఆత్మచేత నడిపించబడి, మనస్సును దేవుని రక్తముచేత కడుగుకొని, శుద్ధి చేసుకుని, దేవుని వెదకినప్పుడు, తప్పిపోయిన గొర్రె, పోగొట్టుకొనిన నాణెము, తప్పిపోయి, చనిపోయి తిరిగి బ్రతికిన కుమారుని వలె, సమస్తమును మనకు దొరుకుతాయి. "మీరు నన్ను వెదకిన యెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు. నన్ను నేను మీకు కనుపరచుకొందును" (యిర్మీయా 29:13, 14). దేవుడే మనకు దొరుకుతాడు. ఆయన తప్ప లోకములో మనకు ఏదియూ అవసరం లేదు. తట్టుడి మీకు తీయబడును. "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని, తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి, అతనితో నేనును, నాతోకూడ అతడును భోజనము చేయుదుము (ప్రకటన 3:20). అలాగే నీవును అనేకమైన మూయబడిన తలుపులు కలిగిన హృదయ ద్వారాలను దేవుని వాక్యము చేతపట్టుకుని తట్టవలెను. మన మార్గములలో మూయబడిన ద్వారములను ప్రార్థన ద్వారా తెరువవలెను. దేవుని పరిశుద్ధాత్మ ఆలాగును మీరు అడిగిన వాటి కంటెను, వెదకిన వాటికంటెను, తట్టు వాటికంటెను మీకు అత్యధికముగా దయచేయును గాక ఆమెన్.

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

# మధ్యకాలము

క్రీ.పూ. 221 సం॥లో యెరూషలేమునందు అన్ని విషయములు ప్రశాంత పరచబడెను. టోలమీ ఎవర్‌గేటస్ తర్వాత ఐగుప్తునకు రాజుగా వచ్చి అంతియొకస్ సైన్యమును ఓడించి, తన ఐదు సంవత్సరముల పాలనలో యెరూషలేము యాత్రను కొనసాగించి తాను జయించిన ప్రాంతములన్నిటిని దర్శించెను. కాని ఆ యాత్ర నిజముగా యూదులకు కష్టకాలమాయెను. క్రీ.పూ. 217 సం॥లో ఫిలోపీటర్‌కు దేవుని ఆలయమందలి అతి పరిశుద్ధ స్థలమునకు సంవత్సరమునకు ఒకసారి “గొప్ప పాపపరిహారార్ధబలి” నర్పించు సమయమందు వెళ్ళవలెననెడి ఆశ కల్గినవాడై యుండెను గాని ప్రధాన యాజకుడు తప్ప అతి పరిశుద్ధ స్థలములోనికి ఎవ్వరిని అనుమతింపబడరు. గనుక ప్రజల యొక్క ఏడ్పులు, అంగలార్పుల ద్వారా అతడు నిరాకరించబడెను. కాని అతడు ఇంకను ఆలయ గర్భాలయములోనికి వెళ్లుచుండగా అతనిని పైశాచిక విధానములో ముట్టివేసి సగము చచ్చిన స్థితిలో వెలుపలకు తెచ్చిరి. అతడు మేల్కొనిన తర్వాత పట్టణము విడచి వెళ్ళుచూ ప్రతీకారము తీర్చుకొందునని ప్రతిజ్ఞ చేసెను. ఆ విధముగా అతడు అలెగ్జాండ్రియా చేరక ముందే యూదుల హక్కులన్నిటిని, సదుపాయములన్నింటిని తొలగించి వేసెను. మరియు అతడు ఆరాధించు “ఒక్నాస్” అను దేవుని గౌరవార్థం యూదులనందరిని ఒలీవ ఆకారంలో మరణతుల్యమైన వ్యధతో కాల్చి చంపవలెనని ఆదేశించెను. ఎవరైతే అతని దేవునికి బల్యర్పణ చేయలేదో వారందరిని సంస్థానము నుండి తొలగించెను. ఐగుప్తులో అతడు ముట్టడి వేసిన యూదులందరు అలెగ్జాండ్రియాలో గుర్రపు పందెముల స్థలమందు (హిపోడ్రాక్) ఏనుగుల చేత త్రొక్కబడి మరణించునట్లు మూయబడిరి. కాని సర్వశక్తిమంతుడైన దేవుడు ఆ దృశ్యమును తిలకించుటకు వచ్చిన వారి వైపే ఆ మృగములను మళ్ళించెను. అందువలన చూచుటకు వచ్చిన వారనేకులు హతులైరి. రాజును అతని అనుచరులును ఈ దృశ్యమును చూచి భయభ్రాంతులై వెంటనే యూదులనందరిని గుర్రపు పందెముల స్థలము నుండి విడిపించెను. అంతేకాక వారి దేశమంతటిని వారి ఆధిక్యతలను తిరిగి సమకూర్చి వారికి వ్యతిరేకముగా వ్రాయబడిన ప్రతి దాఖలను రద్దు చేసెను. హింసింపబడుటకు నిరాకరించిన యూదులు వారి మతమును నిరాకరించి వెలుపలకు వచ్చి అన్యదేవతలను కొలుచునట్లు ఒప్పుకొనిరి. అట్టి వారందరిని రాజు చంపించెను.

క్రీ.పూ. 204లో టోలమీ ఫిలోవిటర్ కుమారుడైన టోలమీ ఎపిఫేనస్ ఐదు సంవత్సరాల వయస్సు గలవాడై యుండెను. అందువలన ఘనుడగు అంతియోకస్‌కు సిరియా పాలస్తీనా దేశములను తిరిగి పొందు అవకాశము కలిగెను. అతని సాహసయాత్రలో యూదులు అతనిని ఎంతో గౌరవించిరి. అందువలన అతడు వారికి ఎంతో ఉపయుక్తమైన పనులు గావించెను. వారి చట్టానికి, మతానికి అనుకూలముగా జీవించుటకు స్వతంత్రులైరి. అన్యులు వారి ఆలయములోని అతి పరిశుద్ధ స్థలమునకు వెళ్ళుటకు నిరాకరించిరి. టోలమీ ఎపిఫేనస్‌కు యుక్త వయస్సు వచ్చినప్పుడు అంతియోకస్ అతనితో సంధి చేసికొని తన కుమార్తెతో టాలమీ ఎపిఫెనస్‌కు వివాహము జరిగించెను. సిరియా, పాలస్తీనా ఆమె భాగముగా ఇచ్చెను. ఆ ప్రదేశపు మంత్రియు, టోలమీ అనుచరుడైన యోసేపు అంతియోకస్ ద్వారా తొలగింపబడి యుండెను. అతను తిరిగి ఈ సమయంలో అధికారమునకు వచ్చెను. టోలమీ ఎపిఫేనస్‌కు అనతికాలంలోనే కుమారుడు జన్మించెను. కుమారుని జన్మదిన సంధర్భముగా ఆ రాజ్యపు అధికారులు గొప్ప వ్యక్తులు వారి శుభాకాంక్షలు తెల్పుచు బహుమతులు ఇచ్చుట అనునది ఆ దేశ సంప్రదాయము. యోసేపు వృద్ధుడైనందున అంత దూరం ప్రయాణం చేయలేక అతని కుమారుడైన హీరైకానస్‌ను పంపెను. (సశేషం)

# నీ సృష్టికర్త

మానవుని పుట్టుక మొదలైనప్పటి అంటే పిండముగా తల్లి గర్భములో ఏర్పడినప్పటి నుండి ఆ పిండమునకు రక్త సరఫరా అవసరం అవుతుంది. అప్పటి నుండి మనిషి తుది శ్వాస విడిచే వరకు మనిషి శరీరంలో గుండె అవిరామంగా పనిచేస్తూనే ఉంటుంది. ఎందుకంటే శరీరంలో అన్ని భాగాలకు రక్తాన్ని అందించవలసిన పని గుండెది.

మానవ శరీరంలో అతి ప్రాముఖ్యమైన అవయవలలో గుండె ఒకటి. గుండె ఊపిరితిత్తులకు మధ్య భాగంలో కాస్త ఎడమవైపుకి వాలిఉండే కండరం. గుండె సంకోచ వ్యాకోచాల వలన గుండె చూట్టూఉన్న అవయవాలు ప్రభావితం కాకుండు నట్లు గండె చూట్టూ రెండు పొరల వలయం ఉంటుంది. గుండె చుట్టూ ఉండే ఈ వలయం గుండెను వివిధరకాల బాక్టీరీయాల నుండి కాపాడే రక్షణ వలయంగా పనిచేస్తుంది. అంతే కాక గుండె కణాలకు నిరంతర రక్తం అందు తుంటుంది కాబట్టి గుండె పెరగకుండా ఆ వలయం అవరో ధిస్తుంది. గుండె రక్షణలో భాగంగా ప్రక్కటెముకలతో కప్పబడి ఉంటుంది.

ఇంట్లో నీటి సరఫరా కొరకు మోటారును ఎలా ఉపయోగి స్తామో సరిగ్గా అలాగే దేవుడు మన శరీరంలో గుండె అనే మోటారును పెట్టాడు. మోటారు వేస్తేనే నీరు ఎలా అయితే మనకు అందుబాటులోకి వస్తుందో అలాగే ఈ గుండె పనిచేస్తేనే రక్తం అన్ని శరీరభాగాలకు అందుతుంది.

శరీరం మొత్తానికి రక్తాన్ని పంపించవలసిన బాధ్యత గుండెది. రక్తాన్ని పంప్ చేయడానికి గుండె నిరంతరం సంకోచ వ్యాకోచాలు చెందుతుంటుంది. గుండె సంకోచ వ్యాకోచాలనే మనం హార్ట్‌బీట్ అంటాం. మనిషి గుండె సగటున నిమిషానికి 72సార్లు కొట్టుకుంటుంది. దీనినే హార్ట్‌రేట్ అంటాం.

ఒక మనిషి జీవితంలో గుండె సగటున 2.5 బిలియన్ సార్లు కొట్టుకుంటుంది. అంటే 2500,00,00,000 సార్లు. అంటే మన జీవిత కాలంలో గుండె 2500 కోట్ల సార్లు సంకోచవ్యాకోచలు చెందుతుందన్నమాట. అంటే రోజుకి దాదాపు1,15,000 సార్లు కొట్టుకుంటుంది.

గుండె రోజుకు 2000 గ్యాలన్‌ల రక్తాన్ని పంప్ చేస్తుంది.

శరీర భాగాలనుండి గుండెకు, గుండె నుండి శరీర భాగాలకు రక్తాన్ని తీసుకెళ్ళే నాళాలను రక్తనాళాలు అంటారు. వీటిలో ముఖ్యంగా రెండు రకాలు. 1. ధమనులు 2. సిరలు.

ధమనులు రక్తాన్ని గుండె నుండి శరీర భాగాలకు అందజేసే రక్తనాళాలు కాగా, సిరలు శరీర భాగాల నుండి రక్తాన్ని సేకరించి గుండెకు చేరవేస్తాయి. గుండె కొంత ఒత్తిడితో రక్తాన్ని ఈ రక్తనాళాలలోకి పంప్ చేస్తేనే, రక్తం కొంత వేగం కలిగి రక్త నాళాల ద్వారా శరీరమంతా ప్రవహించగలుగుతుంది. తద్వారా అన్ని కణజాలాలకు ఆక్సిజన్‌ను అందించగలుగుతుంది.

మన శరీరంలో ప్రతి అవయవం మనం పుట్టిన తరువాత పనిచేస్తే గుండె మాత్రం మనం పుట్టకముందే అంటే తల్లి గర్భములో ఉన్నప్పటి నుండే గుండె పనిచేస్తుంది.

మానవ శరీరంలో ఏ అవయవము పనిచేయాలన్నా దానికి ఆక్సిజన్ అందాలి. ఆ ఆక్సిజన్ రక్తం ద్వారా గుండె నుండి శరీర భాగాలకు అందుతుంది. ఆక్సిజన్ అందని పక్షంలో ఆ అవయవం పనిచేయదు దానినే సచ్చుబడిపోవడం అంటాం. శరీరంలో ప్రతిమూలకు రక్తనాళాల ద్వారా రక్తాన్ని అందించుటకు గుండె నిరంతరం పనిచేస్తునే ఉంటుంది. రకరకాల కారణాల వలన కొన్ని సార్లు రక్తం సంబంధిత అవయవానికి అందకపోతే ఆ ఒత్తిడి గుండె మీద పడుతుంది. ఆ ఒత్తిడి కారణంగా సాధారణంగా ఉండవలసినదానికంటే గుండె సంకోచ వ్యాకోచాలు పెరగడం లేదా తగ్గడం జరుగు తుంది. దానినే మనం సాధారణ భాషలో బి.పి. లేదా బ్లడ్ ప్రెజర్ అని అంటుంటాం. గుండె రక్తాన్ని పంప్ చేసే ఆ

ఒత్తిడినే బిపి అంటాం. శరీర భాగాలకు అందవలసిన ఆక్సిజన్ అందని పక్షంలో గుండె మరింత ఎక్కువ ఒత్తిడితో రక్తాన్ని పంప్ చేయవలసి వస్తుంది. దానినే మనం హైబిపి లేదా అధిక రక్తపోటు అంటాం.

శారీరక ఒత్తిడి పెరిగినా, మానసిక ఒత్తిడి కలిగినా దాని ప్రభావం గుండెమీద పడుతుంది. వ్యాయామాలు చేసినా, బరువులు ఎత్తడం వంటివి చేసినా మనకు ఆయాసం కలగడానికి కారణం గుండె మీద పడే భారమే. అలాగే కోపం, టెన్షన్, వంటి భావాలు కూడా గుండె పనితీరును ప్రభావితం చేస్తాయి.

మనం పుట్టినప్పటి నుండి చచ్చే వరకు నిరంతరం పని చేసి మనం బ్రతికి ఉండటానికి కారణమైన గుండె బరువు సగటున 350 గ్రాములు. దాని పరుమాణం మనిషి పిడికిలి అంత. అంత చిన్న అవయవం దేవుడు మనలో నింపిన జీవమును నిలిపి ఉంచడానికి 60, 70 సం॥లు నిరంతరం పనిచేస్తుంది.

గుండె దేవుడు నిర్ణయించిన దానికన్నా నిదానంగా కొట్టుకున్నా, వేగంగా కొట్టుకున్నా మనం ప్రశాంతంగా ఊపిరి పీల్చలేము దానినే హార్ట్ఎటాక్ అంటాము.అదే గుండె ఒక్క సెకను విశ్రాంతి తీసుకుంటే మన పరిస్థితి ఏంటో తెలుసా? ప్రాణాలు విడవడమే.

మానవ శరీర నిర్మాణం గురించి తెలుసుకొనుటకు కాస్త సమయం కేటాయిస్తే, దేవునికి మానవుని పట్ల ఉన్న శ్రద్ధ అర్థమౌతుంది. మనిషి వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంత ప్రగతిని సాధించినా, అది కేవలం దేవుని సృష్టిలోని ఒక చిన్న అంశం యొక్క అధ్యాయనమే.

కాబట్టి ఇంత అమూల్యమైన శరీరాన్ని, అందులో జీవాన్ని మనకు ఉచితంగా ఇచ్చిన దేవుని పట్ల మనం ఎటువంటి వైఖరి కలిగి ఉన్నామో ఆలోచించాలి. అనంతజ్ఞానియైన దేవుని పాదాల వద్ద సమయం కేటాయించగలిగితే తుచ్ఛమైన లోకజ్ఞానమునుబట్టి అతిశయిస్తున్న మనిషి తన అహమును విడిచి ఆయన శరణు వేడుకొనుట అనివార్యము.

అది సరిపోదన్నట్టు మన నిమిత్తం తానే సిలువ మరణమొంది తన ప్రేమను మనకు వెల్లడిపరచిన దేవుని పట్ల కృతజ్ఞత గలవారమై జీవించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నీ జీవితమును సరిచేసుకొని జీవమునకు మూల మైన, నీకు జీవము ఇచ్చిన దేవుని పట్ల కృతజ్ఞతతో, భయ భక్తులతో జీవించుట కొనసాగించి ఆశీర్వాదాలు పొందు కొనుము.

## చందాదారుల వివరములు

1. రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
2. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
3. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
4. అపో. ఎబినేజర్గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
5. డా॥ సిహెచ్కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
6. జయ, గుంటూరు - 1500/-
7. గంధం దేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
8. కె. రజిని, నరసరావుపేట - 1000/-
9. వి. కస్తూరి, భీమవరం 500/-
10. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
11. పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
12. బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
13. నైటింగేల్, నెల్లూరు - 500/-
14. మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
15. డి. శ్యామ్సిన్హా, బాపట్ల - 500/-
16. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
17. జి. కళావతి, ఒంగోలు 350/-
18. శ్రీమతి కె. కల్పన, గోవా - 350/-
19. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
20. శ్రీమతి సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట- 350/-
21. కె. రాజేష్, రాజమండ్రి - 350/-
22. శ్రీ యస్. గోపి, పార్వతిపురం - 350/-
23. పి. దేవదానం, గుంటూరు - 300/-
24. పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
25. ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
26. టి. క్రీస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
27. జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-

**సాక్ష్యము**

# మహిమ గల దేవుడు

నా పేరు క్రిష్ణారెడ్డి, మా స్వగ్రామం బేస్తవారిపేట మండలం, అక్కపల్లి గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. మేము విగ్రహారాధికులం. ఆర్థికంగా స్థిరపడిన కుటుంబం. మాకు యేసుప్రభువు అంటే ఎవరో తెలియదు. ఎవరైనా దైవసేవకులు మా ఊరికి వస్తే వాళ్ళను అవమానపరిచే వాణ్ణి. క్రైస్తవులంటే నాకు గిట్టేది కాదు. మా ఊరిలో నా మాటకు తిరుగులేదు. నేను చిన్నప్పటి నుండి హైదరాబాద్‌లో పెరిగాను. నేను ఒంగోలు హైదర్ క్లబ్‌లో సూపర్వైజర్ గా పనిచేయుచున్న సమయంలో నాకు ఒకరోజు విపరీతంగా కడుపునొప్పి వచ్చింది. క్లబ్‌వారు నన్ను హాస్పటల్లో చేర్పించారు. డాక్టరుగారు ఒంగోలు బెతూన్ నర్సింగ్ హోమ్ లో నాకు పరీక్ష చేసి గాల్ బ్లాడర్‌లో చీము చేరింది ఆపరేషన్ చేయించకోమన్నారు. క్లబ్‌వారి ఆర్థిక సహాయంతో ఆపరేషన్ చేయించుకోవటానికి వెళ్లాను. డాక్టరుగారి నిర్లక్ష్యం వలన మత్తుడాక్టరును పిలువకుండా డబ్బుకు గడ్డితిని వర్కర్లతో మందు ఇప్పించాడు. ఆ మత్తుమందు వలన వెంటనే నాకు రియాక్షన్ వచ్చి గిలగిల తన్నుకుంటున్న నా పరిస్థితి చూచి డాక్టరుగారు నోటిలో నోరుపెట్టి ఊది స్పృహ కలిగించి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసిన పదిరోజులకు నా కాళ్ళు మొద్దుబారి జివ్వున లాగుతూ స్పర్శ లేకుండా పడిపోయాయి. డాక్టరు నా పరిస్థితి చూచి, ఈ జబ్బు నాకేం అర్థంకావడం లేదని చెప్పి, చీటి వ్రాసి నన్ను గుంటూరు తారకనాథ్ నరాల స్పెషలిస్ట్ దగ్గరికి పంపించాడు. ఆ డాక్టర్ సి.టి. స్కానింగ్, చాలా పరీక్షలు చేసి కాళ్ళు రావని చెప్పారు. మా అత్తగారి ఊరు గుంటూరు కావటం వలన నన్ను వాళ్ళ యింటికి తీసుకువెళ్ళి ఎవరో నాకు చేతబడి చేశారని, భూత వైద్యుణ్ణి పిలిపించి పెద్ద పెద్ద ముగ్గులు వేయించి, ముగ్గుల మధ్యలో నన్ను కూర్చుండబెట్టి డబ్బులు మా చేత బాగా ఖర్చు పెట్టించి చివరకు మావల్ల కాదని వెళ్ళిపోయారు. అప్పట్నుండి నాకీ గతి పట్టించిన డాక్టరును ఎలాగైనా చంపి, నేనూ చావాలని నిశ్చయించు కొని, నా మిత్రుడ్ని పిలిపించి వాని ద్వారా ఒక బాంబు చేయించి, ఆ బాంబు ద్వారా నేను డాక్టరు ఇద్దరం ఒకేసారి చావాలని ఒక పథకం ఆలోచించాను.

వెంకటరెడ్డి అనే బంధువు రోజు నా మంచము దగ్గరకు వచ్చి అన్నా నీవు యేసుప్రభువును నమ్ముకుంటే తప్పక నీకు కాళ్ళు వస్తాయి అని చెప్పాడు. కాని నేను కోపగించి, లక్షరూపాయలు 'ఖర్చుపెడితే రాని కాళ్ళు ప్రభువును నమ్మితే వస్తాయా? అని తిట్టినాను. అయినా నన్ను వదిలిపెట్టక అన్నా నువ్వు బాగా బ్రతికిన వాడివి, ప్రభువును నమ్మితే తప్పకుండా కాళ్ళు వస్తాయని చెప్పి ప్రార్థించి కొబ్బరినూనె నా కాళ్ళకు రాసి బైబిల్ తెచ్చి నా తల క్రింద పెట్టి, చదవమని చెప్పి వెళ్ళిపోయాడు.

ఒకరోజు అర్ధరాత్రి మెళుకవ వచ్చి బైబిల్ తీసి కొత్తనిబంధన మత్తయి సువార్త చదవటం మొదలు పెట్టాను. మొదటి అధ్యాయం నాకు అర్థము కాక ప్రక్కన పెట్టాను. తరువాత ఉదయం మరల వెంకటరెడ్డి వచ్చి బైబిల్ తెరచి అర్థము అయ్యేటట్లు చెప్పి, చదవమని చెప్పాడు. నాకు చదవాలని ఆసక్తి కలిగి చదవటం మొదలు పెట్టాను. రోజుకొక అధ్యాయం చొప్పున మొత్తం 28 అధ్యాయాలు చదివాను. ఒకరోజు రాత్రి నాకు ఒక దర్శనం వచ్చింది. అది ఏమంటే నా శరీరం మొత్తం పాములతో బంధింపబడి ఉంది. అవన్నీ ఒక్కొక్కటి విడిపోయి నాకు కాళ్ళు కదలటం ప్రారంభించాయి. నేను, నా భార్య ప్రభువును అంగీకరించి, ఆయనయందు విశ్వాసంలో బలపడి పాప క్షమాపణ నిమిత్తం 1994లో మేము బాప్తిస్మం తీసుకున్నాము. మాకు ఇద్దరు కుమారులు. ఒకని పేరు నాగార్జునరెడ్డి, మరొకనిపేరు శైలేష్ రెడ్డి. మేము ఆపరేషన్ నిమిత్తం ఇంకా అనేక విధాలుగా ఖర్చుచేసిన మొత్తమునకు రెట్టింపు ప్రభువు మాకు యిచ్చారు. డాక్టరు మీద కేసు పెట్టి ఉన్నాను. అతని ద్వారా నేను ప్రభువును తెలుసుకున్నాను. కాబట్టి ఒక పాస్టర్ గారి సలహా మేరకు కేసు విత్ డ్రా చేసుకొన్నాను. నా సాక్ష్యం ద్వారా దేవుడు మీ జీవితాలను కూడా ఆశీర్వదించాలని ఆశిస్తున్నాను. యేసుప్రభువే నిజమైన దేవుడు. ఆయన సజీవుడు నిన్న నేడు నిరంతరం ఆయన మారని దేవుడు. మహిమగల దేవుడని మీ అందరి యెదుట సాక్ష్యం చెప్పుచున్నాను. దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమెన్.

# సిలువ అనుభవం

హన్నాకృప పాఠకులకు పునరుత్థాన పండగ శుభాకాంక్షలు. దేవునితో ఎడబాటును సిలువ అనుభవం అని పేర్కొంటారు బైబిలు పండితులు. మన జీవితాలలో దేవునితో ఎడబాటుకు కారణం మన పాపస్వభావం.

*"మీ దోషము మీకును మీ దేవునకిని అడ్డముగా వచ్చెను మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" యెషయా 59:1,2*

అయితే మన పాప స్వభావాన్ని బట్టి దేవుడు మనల్ని విడిచిపెట్టక తన ప్రేమనుబట్టి మన యెడల కృప చూపి తన యొద్దకు తిరిగి రావాలని ఎదురు చూస్తున్నాడు.

*"తమ ఆలోచనలననుసరించి చెడుమార్గమున నడుచు కొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను" యెషయా 65:2*

యేసుక్రీస్తు వారు సిలువలో *"ఏలీ ఏలీ లామా సబక్తానీ" అని పలికాడు. ఆ మాటకు నా దేవా, నా దేవా నన్నెందుకు చేయి విడిచితివి అని అర్ధం"* (మత్తయి 27:46)


ఈ వాక్యమను జాగ్రత్తగా గమనిస్తే దేవుడు యేసుక్రీస్తు చేయి విడిచిపెట్టాడట అందుకనే యేసు అడుగుతున్నాడు నన్నెందుకు విడిచిపెట్టావు అని? అసలు దేవుడు చేయి విడుస్తాడా? నిన్ను విడువను ఎడబాయను అని చెప్పిన దేవుడు చేయి విడుస్తాడా? ఇశ్రాయేలు దేవుడు కునకడు నిద్రపోడు అని వాక్యం సెలవిస్తుంది కదా! పోనీ దేవుడు చేయి విడిచి పెట్టడానికి యేసుక్రీస్తేమైనా తప్పు చేశాడా? లేదే, యేసుక్రీస్తు పాపరహితుడు, ఆయన నీతిమంతినిగా ఉన్న సమయంలోనే దేవుడు ఆయనను విడిచిపెట్టాడు. అదే సిలువ అనుభవం.

యేసుక్రీస్తు దేవునికి దూరమవ్వలేదు... దేవుడే యేసుక్రీస్తును విడిచిపెట్టాడు... యేసు నీతిమంతుడైనప్పటికి దేవుడు ఉద్దేశపూర్వకంగా చేయి విడిచాడు. దేవుని ఉద్దేశాలు ఎల్లప్పుడు మనకు మేలుకరమైనవై ఉంటాయి కాబట్టి ఆయన ఉద్దేశాన్ని నెరవేర్చుటకు ఇష్టపూర్వకంగా సిద్ధపడాలి. యేసుప్రభువు అదే చేశాడు. ఆయన దేవునిని నిందించలేదు, సిలువ మరణం దేవుని చిత్తమని ఎరిగి దానికై సిద్ధపడ్డాడు. మన జ్ఞానంతో చూస్తే ఏ పాపం చేయని యేసుకు మరణ శిక్ష అన్యాయం అయితే దేవుడు దానిని అనుమతించాడు. యేసుక్రీస్తు దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి సిద్ధపడ్డాడు అందులో భాగంగా దేవుని ఎడబాటును భరించాడు.

ఫలితంగా యేసుక్రీస్తు మరణాన్ని గెలిచిలేచాడు. తండ్రితో సమానంగా ఆయన కుడిపార్శ్వమును సింహాసనసీనుడై కూర్చునే అర్హత సంపాదించాడు. ప్రపంచ మానవాళికి రక్షకుడైనాడు. భూమి మీద జనులందరికి మాదిరిగా ఉన్నాడు.

*"ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్న వారిలో గాని, భూమి క్రింద ఉన్న వారిలో గాని ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతినాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను"* ఫిలిప్పీ 2:8-11

కాబట్టి మన జీవితాలలో కష్టాలను కన్నీళ్ళను దేవుడు అనుమతిస్తే దేవునిని నిందించక ఆయన చిత్తమును నెరవేర్చుటకు ఇష్టపడి సిలువను అనుభవించుటకు సిద్ధపడుదాం!



**ఆధునిక దృక్పథం**

# క్రొత్త కోణాలు

## మంచి సమరయుని కథ

**యేసు మంచి సమరయుని కథ (ఉపమానం) చెప్పాడు. అదొక సుందర, సుమధుర, సుమనోహర, సౌవార్తిక వర్ణచిత్రం. మత ప్రమేయం లేకుండ ప్రపంచమంతట అంగీకరింపబడే ధర్మశాస్త్ర స్వప్నం. 'నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుమనే సర్వజన శ్రేయోస్ఫూర్తికి సాక్షీభూత రూపకం. నీకున్న కలిమిని లేమిగల వారితో పంచుకోమనేది దీని తాత్పర్యంగా అందరూ అనుకొనేది. అనేక ప్రపంచ సేవా (Relief & Aid) సంస్థలకు పునాది. ఇందలి క్రొత్తకొణాల్ని పరిశీలిద్దాం.**

మంచిసమరయుని కథ లూకా సువార్తలో మాత్రమే ఉంది (లూకా 10:30-37). అయితే యేసు దాన్ని చెప్పటానికి ప్రేరకం మత్తయి (22:34-40), మార్కు (12:28-34), లూకా (10:25-29)లలో చూడగలం.

'నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెన'నేది ఒక ధర్మశాస్త్రోపదేశకుడడిగిన ప్రశ్న. ధర్మశాస్త్రాన్ని కాచి, వడపోసి, అవపోసనం చేసిన పరిసయ్యులకు, అంటే ఆనాటి మత ప్రవిష్టులకు, దాని జవాబు తెలియక కాదు. అంతకు ముందే (మత్తయి 22:23-33) సద్దూకయ్యులను పునరుత్థాన విషయంలో ఒక క్రొత్తకోణంలో నోరు మూయించిన యేసు సత్తాను పరీక్షించటానికి అడిగిన ప్రశ్న.

యేసు, బడి పిల్లాడిలా అడిగిన ప్రశ్నకు జవాబియ్యలేదు. ధర్మశాస్త్రంలో ఏముందని నీవు చదివావు?' అని రెట్టించాడు. వజ్రాన్ని వజ్రంతోనే ఖండించాలి. అతడు, ధర్మశాస్త్రంలో మోషేకు దేవుడిచ్చిన పదిఆజ్ఞల (నిర్గ. 30:1-17,ద్వితీ. 5:6-21) సంక్షిప్త స్వరూపంగా కేవలం రెండు ఒకదానికి సమానమైన దొకటైన రెండు ఆజ్ఞల్లో (ద్వితీ. 6:5,10:12, లేవీ. 19:18) ఉన్నట్లు రెప్ప తటపటాయించకుండా చెప్పాడు. దేవుణ్ణి ప్రేమించాలని, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించాలని. ఇంకేం, అలానే చేయి నిత్యజీవం పొందుతావు అన్నాడు. ధర్మశాస్త్రోపదేశకునికి, ఈనాటి మాటల్లో, గాలిపోయింది. బెట్టు నిలుపుకోటానికి, తానేదో నీతిమంతుడైనట్లు కనబరచుకొనటానికి, తానలా చేస్తున్నాడనిన్నీ, అయితే, తన సంశయమంతా 'నీ పొరుగు వాడెవడు?' అనేనని ఒక తెలివైన తెలివితక్కువ ప్రశ్న మరీ వేశాడు! అతనికి తన పొరుగువాడెవడో తన స్వంత నిర్వచనం ప్రకారం తెలుసు. తన స్వజాతీయుడైన యూదుడు తన పొరుగు వాడు. ఆ యూదులలో కూడా తనతో పాటు నిష్ఠాగరిష్ఠుడై, దేవాలయానికిపోతూ, దాని కార్యకలాపాల్లో తనవలె పాల్గొనే పరిసయ్యులు తన పొరుగువారు. యూదేతర జాతులు అతని పొరుగువారు కారు. వారిని కుక్కల్లా ద్వేషించటమే అతని ప్రత్యేకత. వృత్తిరీత్యా సుంకరుడైతే చాలు, వారు యూదులైనా పాపులే. వారితో పొత్తు ఉండకూడదు. దురదృష్టవశాత్తు వ్యాధిగ్రస్థులు (కుష్ఠ, రక్తస్రావం, దయ్యం పట్టినవారు) అతని పొరుగువారు కారు. వారు అపరిశుద్ధులు. వారిని తాకనైనా తాకకూడదు. మాలిన్యం అంటుకొంటుంది. వారిని సంఘం నుండి వెలివేసి ఊరికి దూరంగా ఉంచాలి. కుంటి, గ్రుడ్డి, చెవిటి, అవిటి మొదలైనవారు కూడ తన పొరుగువారు కారు. వారంతా తామో, తమ తాతముత్తాతలో పాపం చేయడం వలన అలా అయ్యారు. అది యూదుల కర్మసిద్ధాంతం! పొరుగువాడనే మాటకు తన నిర్వచనమే వేరు. అదే నిర్వచనం యేసు కూడా యిచ్చి ఆ ధర్మశాస్త్రోపదేశకుడు చేసేదాన్ని మెచ్చుకొని ఆతణ్ణి నీతుమంతుడుగా తీరుస్తాడని అనుకొన్నాడు. యేసు, పొరుగువాడనే దానికొక క్రొత్త నిర్వచనం చెప్పాలనుకొన్నాడు. తరతరాలుగా కళ్ళుండి కూడ చూడలేని పరిసయ్యులకు 'పొరుగు'కు క్రొత్తకోణాల్లో భాష్యం చెప్పాలనుకున్నాడు. అందుకే మంచి సమరయుని కథ చెప్పాడు. 'మంచి' అనే విశేషణం బైబులులో లేదు. ఆ బిరుదును మనమిస్తున్నాం. ఆయన చెప్పింది దొంగల చేతిలో చిక్కినవాడు, యాజకుడు, లేవీయుడు, సమరయ్యుడు అనే నలుగురి కథని చెప్పాడు. కథకు వద్దాం. కథ, 'ఒక మనుష్యుడు' అని మొదలౌతుంది.

అతనికి ఊరులేదు, పేరులేదు, కులంలేదు, జాతిలేదు, స్థితిలేదు, అంతస్థు లేదు, బాష లేదు, రాష్ట్రంలేదు, వర్ణంలేదు, నామంలేదు. అతనొక సగటు మనిషి. నీవు కావచ్చు, నేను కావచ్చు ఎవరైనా కావచ్చు.

అతడు యేరూషలేము నుండి యెరికోకు వెళ్ళుతున్నాడు. 18 మైళ్ళ దూరం. కాని, యెరూషలేము మంచిస్థితికి, యెరికో దుస్థితికి సూచకాలు. ఒక దిగజార్పు దిశలో ప్రయాణించే వాడను కోవచ్చు. అది ఆర్థికంగా కావచ్చు, సాంఘికంగా కావచ్చు. ఆత్మీయంగా కావచ్చు. దేవుని స్వరూపంలో చేయబడిన మానవ దశనుండి అధోగతిదిశలో పయనం మొదలైనవాడై యుండ వచ్చు. ఎలాగైతేనేం-అతడు దొంగల చేతిలో చిక్కాడు. దొంగలు – రకరకాలు. కొందరికి దొంగతనం ఒక వత్తి. ఒక జీవనో పాధి. ఇతరులను దోచుకొని తాము జీవిస్తారు. మరోరకం దొంగలున్నారు. వారు ధనవంతులు, కులవంతులు, బాగా ఉన్నవారు. వారు ఇతరుల రక్తాన్ని పిండి, కండరాల్ని కరిగించి సొమ్ము చేసుకొంటారు. వీరు దోపిడీగాండ్రు (Exploiters). కులం పేరిట, మతం పేరిట, జాతి పేరిట ఇతరుల్ని అణగ ద్రొక్కుతారు. దళితుల్ని సృష్టిస్తారు. ఇతరుల నోరుకొట్టి తమ బొజ్జలు నింపుకొంటారు. మొదలే లేని వారిపైబడి వారి దుస్తులు కూడా దొంగిలిస్తారు, హింసిస్తారు, చావుదెబ్బలు కొడతారు, అణగారుస్తారు, నిస్సహాయుల్ని చేస్తారు. కొన ఊపిరితో దిక్కులేక పడిఉండే స్థితిలోనికి ఈడుస్తారు.

మరోరకం దొంగలున్నారు. పరిసయ్యులులాంటి కనికరం లేని మతస్థులు. దేవుని వారమని చెప్పుకొనే సాతాను వారు. యోహాను 10:10లో సాతానును 'దొంగ' అని యేసు ప్రస్తా వించాడు. అతని పని దొంగిలించటం (to steal), హత్య చేయటం (to kill), నాశనం చేయటం (to destroy). ఈ దొంగలు 'దుస్తులు' దొంగిలిస్తారు. దుస్తులు దొంగిలిస్తే దిగంబ రులౌతారు. దిగంబరమంటే పాపంలోనికి కూరుకుపోయి యుండటం (ఆది. 3:10). పైపెచ్చు కొరప్రాణంతో విడిచిపెట్టి పోతారు. అంటే, జీవం (నిత్యజీవం), మరణం (నిత్యనరకం) మధ్య కొట్టుమిట్టాడే స్థితిలో పడవేసిపోతారు.

ఇది ఆ దొంగలచేత చిక్కినవాని పరిస్థితి. ఈ నిస్సహాయుని ఆదుకొనేదెవరు? ఈ తాడిత, పీడిత, దళిత జనానికి ప్రతిగా పడిన వానినాదుకోవల్సిందెవరు? అది సామాజిక దౌర్భాగ్యం నుండేకాని, ఆత్మీయ అధోగతినుండైతేనేం?

యేసు, ఈ దశలో ముగ్గురు వ్యక్తుల్ని ప్రవేశపెడుతున్నాడు. పోలీసు (రోమీయ రాణువ) వారినిగాదు, రాజకీయ వాదుల్ని కాదు, ప్రజాపోరాటదారులైన బరబ్బాలాంటి జెలూతీయుల్ని కాదు. ఆ త్రోవన తటస్థించిన వారు ముగ్గురు.

మొదటివాడు యాజకుడు (Priest) దేవాలయంవద్ద పనిచేసే వాడనే అర్థం వచ్చేమాట హెబ్రీ మూలపదం. సభా ముఖ్యడు (2సమూ. 8:15) అనే అర్థం కూడ. వీరికి మూడు బాధ్యత లున్నాయి – దేవుని చిత్తాన్ని తెలుసుకొనటం, దానిని ప్రజలకు తెలుపటం, ఆచారాలను జరపటం (నిర్గమ. 28:14). అసలు యెరికో పట్టణం యాజక పట్టణం. ఆ రోజుల్లో దాదాపు 12,000 మందికన్నా ఎక్కువమంది యాజకులు యెరికోలో ఉండే వారని ప్రతీతి.

రెండవవాడు లేవీయుడు (Levite) లేవీ వంశస్థుడు. వంశపారంపర్యంగా దేవాలయపు పని చేసేవారు. మొదట దేవాలయ సామాగ్రిని మోసే పనుల నుండి క్రమేపి దేవాల యంలో సంగీత నాయకత్వం నిర్వహించేవారు (1దిన. 15:16, 33,34). మూడవవాడు సమరయుడు (Samaritan)– అష్షూరు చక్రవర్తి షర్గోను (ఇప్పటి సమరయ)కు క్రీ.పూ. 722లో తెచ్చిన అన్యజనుల సంతతి వాడు. వారు ఇశ్రాయేలీ యులతో కలిసి పోయిన సంకరి జాతివారు (2రాజులు 17:14-41). సమరయులంటే యూదుల దృష్టిలో తక్కువ వారు (లూకా 9:59, యోహాను 4:9). సమరయులు ఆచార హీనులు, మతభ్రష్టులని వారి నిరసనభావం.

ఈ ముగ్గురిలో మొదటి యిద్దరు త్రోవప్రక్కన పడిన నిస్సహాయుని చూచారు. అంతే, ఏమీ పట్టించుకోకుండా ప్రక్కగా వెళ్ళి(దాటి)పోయారు. సమరయుడు వచ్చాడు. అతని మీద జాలిపడ్డాడు. గాయాలను కడిగి కట్టుకట్టాడు. తన వాహనం మీద ఎక్కించి ఒక పూటకూళ్ళ యింటికి తీసుకొని పోయాడు. అతనిని అన్ని విధాల పరామర్శించాడు.

ఈ ముగ్గురు విషయం చెప్పటంలో ఆనాటి యాజక వ్యవస్థ యొక్క దౌర్భాగ్యస్థితిని కండ్లకు కట్టేలా యేసు చేశాడు. ఎవరైతే కనికరం చూపాల్సినవారో, ఎవరైతే క్షతగాత్రుల్ని పరామర్శించాల్సిన బాధ్యతలు గలిగి ఉండాల్సినవారో, వారే చూచి దాటిపోయారు. వారికి ఆచారాలే ముఖ్యం. ఒక శవాన్ని

తాకితే ఎక్కడ అంటుపడిపోతామో, అందువలన దేవాలయ కార్యాలు చేయలేకపోతామేమో అనే బాహ్యాచారమే ప్రధాన మయింది కాని, తమ సోదర మానవుని నిస్సహాయ స్థితిలో తమవలె తమ పొరుగు వానిని ప్రేమించాలనే దైవాజ్ఞను, తాము నమ్మే ధర్మశాస్త్రంలో శిలాక్షరాలుగా చెక్కబడిన, నిత్యజీవానికి దారితీసే సూత్రాలను పాటించాలనే జిజ్ఞాస లేకపోయింది.

ఇదే, నేటికీ కొనసాగుతున్న క్రైస్తవ సంఘ సంక్షోభం. ఆనాటి మతవ్యవస్థను అస్తవ్యస్తం చేసిన యాజకుల, లేవీయుల ఆచార ప్రాధాన్యతను ఎత్తి చూపించిన యేసును అనుస రించారు. క్రైస్తవులు. ఆది అపోస్తలుల కాలంలో కథోలిక్కుల కౌంటర్ రిఫర్మేషన్కాలంలో ఈ మానవ సేవాదృక్పథం ఎంతైనా వికసించింది. అయితే, శతాబ్దాలు గడిచేకొద్ది క్రైస్తవసంఘం, దానిని నడిపించే యాజకవర్గం మరలా అదే పరిసయ్యుల పొరపాటులలోనికి దిగజారిపోయింది. గుడులకు పోవటం, గురువులకు నమస్కరించడంలోనే నిత్యజీవముందనే మత్తులో పడిపోతున్నారు. ధర్మశాస్త్రోపదేశకుని 'నా పొరుగువాడెవడ'నే ప్రశ్నకు సమాధానమియ్యలేదు. కథచెప్పి, 'కాగా దొంగల చేతిలో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవరు పొరుగువాడాయె నని నీకు తోచుచున్నది?' అని మరో ప్రశ్నవేసి, తన ప్రశ్నకు తానే సమాధానము తెలుసుకొనేలా యేసు చేశాడు. 'అతని మీద జాలిపడినవాడే' అనెను.

'నీవు వెళ్ళి అలాగుచేయుము' అని యేసు చెప్పెను. ఇది యేసు చూపిన క్రొత్తకోణం. నీ పొరుగువాడెవడో తెలుసు కొనుట కాదు. నీవెవరికి పొరుగువాడవై యున్నావు? నీ స్వంత జనులకా? అక్కరలోనున్న ఎవరికైనానా! ఈ అక్కర కేవలం ధన, విద్యా, వైద్యాది సంబంధమైన సమాజిక సహాయమే కాదు. పాపము వలన సాతానుచే చిక్కుబడి, దానిచే మొత్తబడి, కొనఊపిరితో కొట్టుకొనుచున్న వారికి ఆత్మీయ సహాయముతో మెలివేయబడి యుండవలెను. అన్ని విధములైన (folistic) పరిచర్యయే నేటి, ఇక రాబోయే సహస్రాబ్ది పథకంగా క్రైస్తవసంఘం, దానిని నడిపించే యాజకబృందం గుర్తెరగాలి. ఇది యేసు చూపిన క్రొత్తకోణం.

**వచ్చే మాసం: తప్పిపోయిన కుమారులు**

## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

తన కొరకు ఒక చిన్న ఇల్లయినా కట్టించుకోలేదు. కాని ఒంగోలు పట్టణంలో చీమకుర్తి రాయితో (గ్రానైట్) విశాలమైన చర్చి కట్టించాడు. ఒంగోలులో 1908లో బాప్టిస్టు చర్చి కట్టబడింది. బాప్టిస్టు మిషన్ తప్పితే వేరే మిషన్ లేదు. ప్రభువు కృపాదానంతో మరో చర్చి కట్టించినప్పుడు చాలా మంది విమర్శించారు. అయితే కృపాదానం ప్రతి వీధికి ఒక మందిరము కట్టబడే రోజులు వస్తాయి. ఇది దేవుని చిత్తము అన్నాడు. నాటి బాప్టిస్టు మిషనెరీ మార్టిన్ క్లౌ దొర ఒక ఆదివారం అకస్మాత్తుగా కృపాదానం చర్చిలోనికి వచ్చి కూర్చున్నాడు. ఆయన ఊహించినట్లు బాప్టిస్టు క్రైస్తవులు ఒక్కరైనా ఆరాధనలో లేరు. అందరు అన్యజనాంగంలో నుండి రక్షించబడినవారే. వారందరిని చూచిన తర్వాత మార్టిన్ దొర చాలా సంతోషించాడు.

1976లో కాకినాడ నుండి లార్స్‌గారిని, ఈరోడ్ నుండి ఒక సువార్తికుని, హైదరాబాద్ నుండి అనేకమైన ప్రసంగికులను ఆహ్వానించి మొదట్లో బాప్టిస్టు చర్చివారి అనుమతితో పెద్దచర్చిలో మీటింగులు పెట్టారు. కాలక్రమంలో చర్చి పట్టనంత జనం రావటం వలన రైల్వే లైనుకు దగ్గరలో 5 ఎకరాల విస్తీర్ణంలో (నేటి ఇందుర్తి నగర్) షామియానాలలో కూటములు ఏర్పాటుచేశారు. వారం రోజులు ప్రతి రోజు మూడు పూటల 400 మందికి భోజన సదుపాయాలు కల్పించారు. 1970వ సంవత్సరము ఒంగోలు పట్టణం మొత్తంలో 15 చిన్న కార్లు (సొంతకార్లు) ఉండేవి. అందులో 3 కార్లు కృపాదానం గారివి. కార్లు పోలేని గ్రామాలకు సువార్తికులు వెళ్ళుటకు వీలుగా, ఒక ఒంటెద్దు బండి, ఒక సైకిల్ రిక్షా, నాలుగు సైకిళ్ళు సేవ కొరకు వాడబడేవి. డ్రైవర్లు కూడ అందుబాటులో ఉండేవారు.

కృపాదానంగారు 1984 వరకు అంటే ఆయన 72 సంవత్సరముల వయస్సు వచ్చేవరకు ఎన్నడు హాస్పిటల్‌కు వెళ్ళలేదు.

1971లో అమెరికా దేశం వెళ్ళినప్పుడు ఒక రైల్వే గూడ్సు కంపార్టుమెంటు నిండా హాస్పిటల్ సామాను, మందులు, స్ట్రెక్చర్సు, వీల్‌చైర్స్, కలకత్తా వరకు ఓడలోను తర్వాత రైల్వే గూడ్సు పెట్టెలోను వచ్చినవి. వాటితో ఒంగోలులోను, క్రొత్తపట్నంలోను నర్సింగ్ హోమ్ ప్రారంభించి సేవచేశారు. ఆ హాస్పిటల్స్‌లో పనిచేసిన డాక్టర్లు తర్వాత గవర్నమెంటు డాక్టర్లు అయ్యారు. తర్వాత ఒంగోలు పట్టణం కేంద్రంగా మల్టీస్పెషాలిటి హాస్పిటల్స్ ప్రారంభించాలని గ్రౌండ్ వర్కు పూర్తయింది. కాని అది ప్రారంభించక ముందే ఆయన ప్రభువు సన్నిధికి వెళ్ళారు. ఒంగోలు పట్టణంలో రోటరీ క్లబ్‌లో మెంబర్‌గా ఉండి అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను నడిపించారు.

కృపాదానంగారిని మనుష్యులు రకరకాల కోణాలలో చూచినప్పుడు రకరకాల బిరుదులు ఇచ్చేవారు. వారిలో ప్రథముడు డా॥ బ్రేస్టర్డ్. కృపాదానంను పిలిపించి నీ పెద్ద కుమారుని డాక్టర్‌గా యం.బి.బి.యస్. చదివిస్తాను అన్నాడు. అందుకు కృపాదానం ఒప్పుకోలేదు. నా పెద్ద కుమారుడిని సేవకి సమర్పించుకున్నాను అన్నాడు. ఆ దొరకి కోపం వచ్చి నీవు తలబిరుసువాడివి అన్నాడు. అప్పుడు కృపాదానంగారు 'అవును, దేవుని విషయంలో నేను తలబిరుసువాడినే' అని చెప్పి వచ్చేశాడు.

ఒంగోలులోని పెద్ద చర్చి ఎదురుగా ఉన్న హైదర్‌క్లబ్‌కు సాయంకాలం నాలుగు గంటలకు గోగుమళ్ళ ప్రకాశం అనే స్నేహితునితో కలిసి వెళ్ళేవారు. టెన్నిస్ బాలు అందించేవారు. కృపాదానం వచ్చే వరకు ఆట మొదలు పెట్టేవారు కాదు.

హైదర్‌క్లబ్ పడమర వైపున ఉన్న పూడ్లి మిషన్ హాస్పిటల్ పని పూర్తయినప్పుడు కృపాదానంకు 15 సంవత్సరముల వయస్సు. ప్రతిరోజు క్లబ్‌కు వెళ్ళేటప్పుడు పెద్ద చర్చిలోనికి వెళ్ళి ప్రార్థన చేసుకొని వెళ్ళమని తల్లి చెప్పేది. క్లౌపేటలోని కృపాదానం ఇంటికి హైదర్‌క్లబ్

మధ్యలో ఏ అడ్డం లేనందున చాలా దగ్గరగా నడిచి పోవచ్చును.

ఒకరోజు క్లబ్ ఛైర్మన్ కృపాదానం కొరకు తన పనివానిని కృపాదానం ఇంటికి పంపుతుండగా, అక్కడి వారు ఎవరో కృపాదానం చర్చిలో ఉంటాడు చూడండి అని చెప్పారట. అప్పటి నుండి కృపాదానంను చర్చి అబ్బాయి అని పిలుస్తుండేవాడు.

మద్రాసులో ది బెస్ట్ అండ్ కో వారితో దేవుని సేవకి ఉద్యోగము మానివేస్తున్నాడని చెబితే వారందరు నీకు పిచ్చిపట్టిందా? అని ఆశ్చర్య పోయారు. ఎందుకంటే ఆ కంపెనీ మంచి లాభాలు పొందుతున్న సమయంలో కృపాదానంగారు ఉద్యోగం మానివేశారు. పైగా ఆ లాభాలకు కారణం కూడా కృపాదానం గారే. అందుకని అందరూ ఆయనను పిచ్చివాడు అన్నారు. ఆయనకి ప్రజలిచ్చిన బిరుదులన్నిటిలో పిచ్చివాడు అన్న బిరుదే గొప్పది.

1962లో ఒంగోలులోని బాప్టిస్టు చర్చివంటి చర్చిని క్లాపేటలోని తన ఇంటిముందు కడతానని అంటే నేను గమ్మత్తుకి సరదాకి అన్నాడు అనుకొన్నాను. కాని వారం తర్వాత ఇద్దరు బేలుదార్లను పిలిపించి 90 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు కలిగిన చర్చి నిర్మాణం మొదలు పెట్టారు. గ్రౌండ్ ఫ్లోరు బైబిలు కాలేజికి రెండవ అంతస్తు పాస్టర్ల గృహముల కొరకు, మూడవ అంతస్తులో మందిరము ఉండునట్లు ప్లానింగ్ అయినది. పిల్లర్లు కాకుండా 12 అడుగుల లోతు, ఆరడుగుల వెడల్పు ఉన్న పునాది వేసి పైకి వచ్చేటప్పటికి మూడు అడుగులు (రెండు వరుసల) గ్రానైట్ రాళ్ళతో వేయించాడు. నేనైతే హృదయపూర్వకముగా మా నాయనకి మతిస్థిమితం తప్పిందని మా అమ్మతో అన్నాను. 1969లో ఆ చర్చి ముగిసిన తర్వాత అంత అందమైన చర్చి ఇంతవరకు నేను ఎక్కడ చూడలేదని సాక్ష్యమిస్తున్నాను.

నేను బి.ఎ. చదివేటప్పుడు ఫెయిత్‌ఫుల్ అండ్ ఫియర్‌లెస్ అనే ఇంగ్లీషు పుస్తకం ఇచ్చి చదువమన్నాడు నాయన. అందులో దేవుని విశ్వాసముతో వెంబడించిన వారి జీవిత చరిత్రలు ఉన్నాయి. కాని వారిలో ఏ విశ్వాసైనా 12 మంది సంతానం కలిగి ఉన్నట్లుకాని, సంతానాన్ని అన్నం లేక పస్తులు పెట్టారని నేను చదువలేదు.

దేవుడు అబ్రాహాముతో నీకు ఒక్కడైయున్న నీ కుమారుని అనగా నీవు ప్రేమించు ఇస్సాకును తీసుకొని దహనబలిగా అర్పించమన్నాడు. అబ్రాహాము తన కుమారుని దేవునికి దహనబలిగా అర్పించియుంటే ఒక్కసారే ఇస్సాకు చచ్చిపోయి యుండేవాడు. కానికృపాదానం పన్నెండు మంది పిల్లలు ప్రతిరోజు ఆకలికి అల్లాడుతుంటే ప్రతిదినం నరకమే కదా. ముఖ్యంగా ఆయన పెద్ద కుమారుడు ఒకటిన్నర మైలు దూరం కాలేజికి నడిచి వెళ్ళి అన్నం లేకుండా సాయంకాలం ఇంటికి వస్తూ అనేకమార్లు హృదయపూర్వకముగా ఛీ, ఇదేమి జీవితం కనీసం అన్నం కూడా తినటానికి నోచుకోలేదు. చచ్చిపోతే బాగుండును అనుకొన్నాను. మూడు సంవత్సరములు అన్నం లేకుండానే జీవించసాగాను. నేను అన్నం కోసం అల్లాడుతుంటే కృపాదానం తన కుమారునికి బి.ఎ. చదవటానికి ఇంట్లో ఓ టేబుల్ అయినా ఇవ్వలేకపోయానే అని చాలాసార్లు బాధపడేవాడు. క్రొత్తపట్నం దగ్గర బకింగ్‌హామ్ కెనాల్ దగ్గర నుండి ఒంగోలుకు టిక్కెట్టు అక్షరాలా ముప్పైపైసలు. అయితే ఆ 30 పైసలు టిక్కెట్టు పైసలతో బియ్యం తెస్తే బాగుండు – ఇంట్లో అందరు గంజి తాగవచ్చు అని ఎనిమిది మైళ్ళు అంటే 15 కిలోమీటర్లు నడచి ఒంగోలు వచ్చాడు.

ప్రభువు సేవకు రాకముందు ఆయన బరువు 160 కిలోలు. సేవకు సమర్పించుకొనిన ఒక్క సంవత్సరములో 80 కిలోలకు వచ్చాడు. **(సశేషం)**


**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లాపేట, ఒంగోలు–523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# రూతు

యేసుక్రీస్తు వంశావళిలో పలకరించబడిన మూడవ స్త్రీ రూతు. ఆమె జీవితం ఈ సంచిక ధ్యానభాగము.

రూతు గ్రంథం మొదటి అధ్యాయం మొదటి వచనంలో యూదా దేశములో కరవు కలిగినట్టు కనబడుతుంది. ఆ సమయంలోనే ఎలీమెలెకు అను వ్యక్తి యూదా బెత్లెహేము నుండి తన భార్య నయోమి, కుమారులు మహ్లోను, కిల్యోనులను తీసుకొని మోయాబు దేశంలో కాపురం ఉండడానికి వెళ్ళాడు. (రూతు 1:1)

మోయాబువాసులు విగ్రహారాధికులు, శాపగ్రస్తులు కూడా! "లోతు" కుమార్తెలు తమ తండ్రి ద్వారా కనిన అక్రమ సంతానమైన "మోయాబు", "బెన్నమ్మి" అనువారి వంశస్తులు.వీరు అక్రమ సంతానం గనుక శాపగ్రసులైనారు.

*"అమ్మోనీయుడే గాని, మోయాబీయుడే గాని యెహోవా సమాజములో చేరకూడదు" (ద్వితీయ 23:3, నెహెమ్యా 13:1)*

ఫలప్రదమైన యూదా బేత్లెహేములో తాత్కాలికంగా కరవు కలుగగానే "రొట్టెల ఇల్లు"గా ఆశీర్వదింపబడిన బేత్లెహేము నుండి ఎలీమెలెకు కుటుంబం శాపగ్రస్తమైన మోయాబు దేశానికి వలస వెళ్ళిపోయారు. శాపగ్రస్తమైన దేశంలో శాపం తగిలిందో ఏమో ఎలీమెలెకు చనిపోయాడు. తరువాత నయోమి తన కుమారులిద్దరికీ మోయాబు స్త్రీలను వివాహం చేసింది. మరల శాపం తగిలినట్టు కుమారులిద్దరూ చనిపోయారు. ఇక నయోమి తన ఇద్దరు కోడళ్ళు 'ఓర్పా', 'రూతు' ముగ్గురూ విధవరాండ్రుగా మిగిలిపోయారు.

వారికి ఆహార మిచ్చుటకు యెహోవా తన జనులను దర్శించెనని (1:8) నయోమి విని బేత్లెహేముకు ప్రయాణ మైంది. తన కోడళ్ళు ఓర్పా, రూతు కూడా ఆమెతో బయలు దేరారు. నయోమి కొంత ఆలోచించిందేమో దారిలోనే వాళ్ళిద్దరిని చూచి "మీరు మీ తల్లుల ఇండ్లకు తిరిగి వెళ్ళండి" అని చెప్పింది. కొంతసేపు చెప్పిన తరువాత 'ఓర్పా' మనసు మార్చుకొని తిరిగి వెనక్కి వెళ్ళిపోయింది.

కాని రూతు మాత్రం ముసలితనంలో ఒంటరిగా ఉన్న తన అత్తను అలా వదిలి వెళ్ళడానికి ఎంతమాత్రమూ ఇష్ట పడలేదు. అది తన బాధ్యతగా ఎంచింది. తన దేశాన్ని, తన వారిని వదిలి మరొక దేశానికి వెళ్ళిపోవడం సులభమైన సంగతేం కాదు. యవ్వనస్తురాలైన రూతు మళ్ళీ పెండ్లి చేసుకొని సుఖమైన జీవితాన్ని జీవించవచ్చు. కానీ కష్టమైనా, బాధైనా, అవమానమైనా, దుఃఖమైనా అత్తను వదలడానికి మాత్రం ఆమె ఇష్టపడలేదు.

"నా వెంబడి రావద్దనియు, నన్ను విడిచిపెట్టుమనియు నన్ను బతిమాలుకొనవద్దు, నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను. నీవు నివశించు చోటనే నివసించెదను. నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు. నీవు మృతి పొందుచోటనే మృతి పొందెదను. అక్కడనే పాతిపెట్టబడెదను. మరణము తప్ప మరి ఏదైనను నిన్ను, నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంత కీడైన చేయును గాక" అని రూతు అనెను. (రూతు 1:16)

రూతు మాటలు ఆమె ధృఢనిశ్చయతను తెలుపు తున్నాయి. అంతేకాదు తన బాధ్యత ఎంత బాగా గుర్తించిందో కూడా తెలుస్తుంది. తన అత్తను ఎంతగా ప్రేమించిందో అర్ధమౌతుంది. నయోమిపై రూతుకున్న గౌరవాభిమానాలు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. అత్తా కోడళ్ళమధ్య గల సంబంధ బాంధవ్యాలను గూర్చి – ఉన్నవాటికి మరెన్నో లేనివాటిని కల్పించి చెప్పుకోవడం మన సమాజంలో బాగా అలవాటే! కాని రూతు తన అత్తను ప్రేమించడంలో తన ప్రత్యేకతను నిరూపించుకుంది. ఆ ప్రత్యేక ప్రేమను గూర్చి ప్రజలందరు మాట్లాడుకున్నారు. అందుకే బోయజు రూతుతో "నీవు నీ అత్తకు చేసిన దంతయు నాకు తెలియబడెను" (2:10) అని అన్నాడు. రూతు ఓబెదును కనినపుడు కూడ అక్కడ స్త్రీలందరు నిన్ను ప్రేమించి ఏడుగురు కుమారుల

కంటే ఎక్కువగానున్న నీ కోడలు ఇతని కనెను (4:15) అంటూ ప్రశంసించారు.

బేత్లెహేము రూతుకు క్రొత్త ప్రదేశం, ప్రజలు క్రొత్తవారు, పద్ధతులు క్రొత్త, అలవాట్లు కొత్తవి, సొంతవారు లేరు, ఒంటరిగా బాధ్యతలు మీద పెట్టుకుంది. ఉన్న ఊర్లోనే మరొక కుటుంబంతో కలిసి జీవించవలసివస్తే ఎన్నో విషయాలు సరిచేసుకోవలసి వస్తుంది. అయినా అత్తను ప్రేమించి, బాధ్యతను స్వీకరించి ధైర్యంగా బయలుదేరింది. దేవుని యందు భయభక్తులు పెంచుకుంది. అందుకే నయోమితో మాట్లాడిన మాటలలో "నీ దేవుడే నా దేవుడు" అని ధృడంగా చెప్పగలిగింది. ఆయనయందు విశ్వాసంతో ధైర్యంగా ముందుకు సాగింది. ఆ భయభక్తులే ఆమెకు అన్నింటా దీవెనలందించగలిగాయి.

తను సంపాదించి అత్తను పోషించాలనే బాధ్యతను గుర్తెరిగి ఆమెకు లోబడి "నీ సెలవైన యెడల నేను పొలము లోనికి పోయి" (2:2) అంటూ ఆమె సెలవుతోనే పరిగె ఏరుకోవడానికి వెళ్ళింది. ఆమె చెప్పిన స్థలంలోనే స్థిరంగా నిలబడింది. పరిగె ఏరుకొనుటకు వెళ్ళిన రూతును దేవుడు సరియైన మనుష్యుని యొద్దకు పంపించాడు. అతడు ఎలీమెలెకు వంశస్థుడైన "బోయజు". పరిగె ఏరుకొనుటకు కొత్తగా వచ్చిన రూతును గూర్చి విచారించి తెలుసుకొని ఆమె యెడల దయకలిగి పరిగె యేరుకొనుటకు సెలవు యివ్వడం మాత్రమే గాక మరొక చోటికి వెళ్ళవద్దని కూడా చెప్పాడు. "యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుందు నట్లు నీవు వచ్చితివి. ఆయన నీకు పూర్ణమైన బహుమాన మిచ్చును'' అని (2:10-12) ఆమెను దీవించాడు. అంతేకాదు అతనితో కూడ భోజనము చేయుటకు ఆమెను ఆహ్వానించాడు. అతడు ఆమెకు పేలాలు అందియ్యగా తిని, కొన్ని మిగిల్చి తన అత్తయొద్దకు తీసుకొని వెళ్ళి ఆమెకు ఇచ్చి అతడు ఆమె యెడల ఎంత దయ చూపించాడో వివరించినపుడు అతడు ఆమెను విడిపింప గలవారిలో ఒకడని తెలుసుకొని రూతు చేయవలసిన క్రమము ఆమెకు నేర్పించి పంపించింది. నయోమి మాట ప్రకారము రూతు బోయజు దగ్గరకు వెళ్ళి 'నీవు నాకు సమీపబంధువు గనుక నీ దాసురాలి మీద నీ కొంగు కప్పుము అనగా 'యెహోవా చేత దీవెననొందిన దానవు. నీ మునుపటి సత్ప్రవర్తన కంటే వెనుకటి సత్ప్రవర్తన మరియెక్కువైనది' అని అన్నాడు. నీవు యోగ్యురాలవని జనులందరు ఎరుగుదురు' అని చెప్పడంలో ఆమె మంచితనం బాగా గ్రహింపు అవుతుంది.

మరునాడు పురజనులందరి యెదుట రూతును బోయజు పెండ్లి చేసుకున్నాడు. ఆమె గర్భవతియై కుమారునికి జన్మనిచ్చింది. అతనికి ఓబేదు అని పేరు పెట్టారు. అతడు దావీదుకు తండ్రియైన యెష్షయికి తండ్రి. దావీదు వంశావళిలో యేసుక్రీస్తు పుట్టాడు. రూతు యేసు ప్రభువు వంశావళిలో ఉండడం ఎంత గొప్ప భాగ్యం! ఎంత గొప్ప ఆశీర్వాదం!

రూతు తన అత్తను ఎంతో ప్రేమించి, ఆమె బాధ్యతను వహించి నిజదేవుని యందు భయభక్తులు కలిగి విశ్వాసంతో బెత్లేహేములోకి అడుగుపెట్టింది. వినయ విధేయతలతో తన అత్తకు లోబడడంతోపాటు యజమానుని యెడల కూడ గౌరవాభిమానాలు చూపించింది.

శాపగ్రస్తమైన మోయాబీయురాలైనను ఆమె నిష్కల్మష మైన ప్రేమ ఆమెను ఉన్నత స్థానానికి తీసుకొని వెళ్ళింది. ఆమెకు దేవుని యెడలవున్న భయభక్తులు విశ్వాసము ఆమెకు ఎన్నో ఆశీర్వాదాలను తెచ్చిపెట్టింది. మంచితనము, వినయము, విధేయత కలిగిన ఆమె వ్యక్తిత్వముతో ఎన్నో దీవెనలను పొందగలిగింది. ఎంతో ఆదరణ, దయ, ప్రోత్సాహం చూపించి ఆధారంగా నిలిచిన బోయజును భర్తగా పొందుకోవడం ఒక ఆశీర్వాదం. రూతు ఓబేదు అను ఒక కుమారుని కని, రక్షకుడైన యేసుక్రీస్తు వంశావళి లోనికి చేర్చబడింది.

మనము రూతు వంటి మంచి గుణగణాలను అలవర్చు కొని అలాంటి స్వభావాన్ని ధరించుకొని క్రీస్తు రక్తములో కడుగబడి ఆయన కుమారులుగా, కుమార్తెలుగా ఆయన వంశంలో చేర్చబడుదుము గాక!

చిన్నపిల్లల పేజి

# స్వార్థం

లలిత తన అమ్మమ్మతో కలసి ఒక చిన్న పల్లెటూరిలో నివసిస్తుండేది. లలిత అమ్మమ్మకు చేతనైనా సాయం చేసేది. సండేస్కూల్లో చెప్పిన విషయాలను శ్రద్ధగా నేర్చుకునేది అనుదినం ప్రార్థించేది.

ఒకరోజు లలిత స్కూల్ నుండి ఇంటి వచ్చేసరికి అమ్మమ్మ ఎవరితోను ముచ్చటిస్తూ మురిసిపోవడం విన వచ్చింది. ఎవరా అని ఆత్రుతగా వెళ్ళి చూసిన లలితకు తన మామయ్య పిల్లలు జెస్సి జాక్సన్ కనిపించారు. వాళ్ళది ఇంచుమించుగా లలిత వయసే.

లలిత మామయ్య పట్నంలో ఉంటాడు. అత్యవసర పని మీద ఆయన బయటదేశం వెళ్తూ తప్పనిసరి పరిస్థితులలో జెస్సి జాక్సన్‌లను తన తల్లి దగ్గర వదిలిపెట్టి వెళ్ళాడు. లలితను చూసిన అమ్మమ్మ జెస్సి, జాక్సన్‌లను చూపిస్తూ 'చూశావా ఎవరొచ్చారో మనింటికి' అన్నది నవ్వుతూ.

మరునాడు అమ్మమ్మ రకరకాల పిండివంటలు చేసింది. ఎందుకు అమ్మమ్మ ఇంత కష్టపడి పిండివంటలు చేస్తున్నావు అంటే, 'జెస్సి జాక్యన్‌లు ఎప్పుడూ ఇక్కడికి రాలేదు కదా! రాక రాక వచ్చిన వారిని సంతోషంగా చూసుకోవాలి కదా! వారికోసమే ఇవన్నీ' అన్నది. అమ్మమ్మ తన కంటే జెస్సి జాక్సన్‌లను ఎక్కువగా ప్రేమించటం లలితకు నచ్చలేదు.

మరునాడు జెస్సి జాక్సన్‌లు బంతితో ఆటలాడుకుంటూ పొరపాటున ఇంటిలో ఉన్న గాజు బొమ్మను పగలగొట్టారు. అది గమనించిన లలిత అమ్మమ్మకి జెస్సిజాక్సన్‌లపై కోపం వస్తుందని సంతోషించి, 'ఇంట్లో బంతి ఆట ఆడవద్దని అమ్మమ్మ చెప్పింది కదా! ఇప్పుడు చూడండి అందమైన గాజు వస్తువు పగలగొట్టారు' అన్నది కాస్త పెద్ద స్వరంతో. సరిగ్గా అదే సమయంలో లోపలికి వచ్చిన అమ్మమ్మను చూచిన జెస్సీ జాక్సన్‌లు భయపడుతూ 'సారీ నాయనమ్మ మేము కావాలని చేయలేదు పొరపాటున...' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా, ఆమె 'పర్లేదులే మరొక గాజు బొమ్మను కొందాంలే' అన్నది పగిలిన గాజు ముక్కలను ఏరుతూ. అమ్మమ్మ జెస్సి జాక్సన్‌లను ఒక్కమాట కూడ అనక పోవడంతో లలితకు అమ్మమ్మ మీద కోపం వచ్చింది.

లలిత కోపాన్ని పసిగట్టిన అమ్మమ్మ రాత్రి భోజనం అయ్యాక ఆరుబయట ముగ్గురుని కూర్చుండబెట్టుకొని బైబిల్లో యోనా కథ ఎవరికి తెలుసు అని అడిగింది. లలితకు కథ తెలిసినా మౌనంగా ఉండటం గమనించిన అమ్మమ్మ బ్రతిమాలి లలితతో యోనా కథ చెప్పించింది. జెస్సి జాక్సన్‌లు ఎంతో ఆసక్తిగా విని మెచ్చుకోలుగా చప్పట్లు చరిచారు. అమ్మమ్మ కథ చాలా బాగా చెప్పావు లలిత, అని మెచ్చుకొని ఈ కథలో మనం నేర్చుకోవలసిన విషయం ఒకటుంది అదేమంటే నీనెవె ప్రజలు తప్పు చేశారు. కాబట్టి శిక్షింప బడాలని యోనా కోరుకున్నాడు. కానీ దేవుడు మంచివాడు కాబట్టి నీనెవె ప్రజలను శిక్షించక ప్రేమించి వారికి మరొక అవకాశం ఇచ్చాడు.దేవుడు చేసినదాంట్లో తప్పేమైనా ఉందా అని అడిగంది లలితను చూస్తూ. మనం యేసయ్య బిడ్డల మైతే ఆయనవలె మనం కూడా మన తోటివారిని ప్రేమించాలే తప్ప వారి తప్పులను ఎంచి వారు శిక్షింపబడాలని కోరుకో కూడదు అంది. తను యోనాలా ప్రవర్తించిన విషయాన్ని గ్రహించింది లలిత. జెస్సి జాక్సన్‌లకు పల్లెటూరు కొత్త కాబట్టి అమ్మమ్మ ప్రవర్తన సరియైనదే అని అర్థమైంది. వెంటనే లలితకు అమ్మమ్మ మీద ఉన్న కోపం పోయింది. మరునాడు నుండి లలిత జెస్సి జాక్సన్‌లతో ప్రేమగా వ్యవహరించాలని నిర్ణయించుకుంది. ఆ రోజు నుండి జెస్సి జాక్సన్‌లు ఉన్నంత వరకు ముగ్గురు సంతోషంగా కలిసి మెలిసి ఉండటం చూసి సంతోషించింది అమ్మమ్మ.

స్కూల్లో ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్‌కు బట్టలు కొనుక్కోవ డానికి అమ్మమ్మతో పట్నం వెళ్ళాలని స్కూల్ నుండి త్వరగా వచ్చింది లలిత. కాని అనుకోకుండా అమ్మమ్మకి ఆరోగ్యం బాగోలేకపోవడంతో పట్నం వెళ్ళడం కుదర్లేదు. కాస్త నిరాశ చెందినా చేసేది ఏమిలేక పోటిలో నుండి తప్పుకోవాలి అనుకున్నది లలిత.

విషయం తెలుసుకున్న జెస్సి తన దగ్గరున్న డ్రస్‌లను లలితకు ఇస్తూ ఇందులో ఏవైనా నీ పోటికి సరిపోతాయి అనుకుంటే తీసుకో అన్నది. ఆ మాట వినగానే లలితకు ఎక్కడలేని సంతోషం కలిగింది. జెస్సీ డ్రస్‌లు అన్నీ వెస్టర్న్ వేర్ కావడంతో పోటికి సరిగ్గా సరిపోతాయి అనుకుంటూ ఒక డ్రస్ సెలక్ట్ చేసుకుని ఒకసారి వేసుకొని చూడడానికి లోపలికి వెళ్ళింది. అద్దం ముందు నిలబడిన లలితకు డ్రస్ అట్టే నప్పినట్టు అనిపించడం లేదు. పోటీలో పాల్గొనాలా తప్పుకోవాలా అని మళ్ళీ ఆలోచనలో పడింది ఇంతలో జెస్సీ ఆ డ్రస్‌కి మ్యాచ్ అయ్యే చెప్పులు, గాజులు, కమ్మలు తెచ్చి ఇచ్చి పెట్టుకో అన్నది. సంతోషంగా అంగీకరించింది లలిత.

పోటిలో గెలిచిన బహుమతిని చూపిస్తు సంతోషంతో ఉన్న లలితతో అమ్మమ్మ – నీవు జెస్సీ జాక్సన్‌ల విషయమై కుళ్ళుకున్నావు, అప్పుడు నీ మనసంతా కోపంతోను బాధతోను నిండిపోయింది. కానీ ఎప్పుడైతే నువ్వు దేవుని వాక్యం విని నీ మనసును మార్చుకొని వారితో కలిసి పోయావో నీ కోపం బాధ పోయాయి అంతేకాదు ఇప్పుడు ఆ కోపం, దుఃఖం, సంతోషంగా మారిపోయాయి. ఈ రోజు నీ సంతోషానికి కారణం జెస్సీనే కదా. కాబట్టి మరెన్నడు నీవు దుఃఖపడకుండునట్లు స్వార్థంగా ఆలోచించకూడదు అప్పుడు మాత్రమే నీవు సంతోషంగా ఉండగలవు అన్నది. సరే అన్నట్లు తలూపి అమ్మమ్మను కౌగిలించుకుంది లలిత.

*"సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము, మత్సరము ఎముకలకు కుళ్లు" సామెతలు 14:30*

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక విననవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.


## సండేస్కూల్ మెటీరియల్


| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–1 | రూ. 50/– |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–2 | రూ. 35/– |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–3 | రూ. 45/– |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్–4 | రూ. 50/– |
| సండేస్కూల్ కలరింగ్ బుక్–1 | రూ. 50/– |
| సండేస్కూల్ కలరింగ్ బుక్–2 | రూ. 35/– |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–1 | రూ. 35/– |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–2 | రూ. 45/– |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్–3 | రూ. 50/– |
| మార్గము–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/– |
| ఆత్మఫలము–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/– |
| బైబిల్‌బాలలు–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/– |
| ధన్యతలు–వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/– |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/– |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/– |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 40/– |
| సండేస్కూల్ డైరి | రూ. 50/– |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్–1 | రూ. 25/– |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్–2 | రూ. 40/– |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 40/– |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/– |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/– |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/– |
| **సండేస్కూల్ గేమ్స్** | |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/– |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/– |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/– |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/– |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/– |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/– |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/– |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/– |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-03



## నిర్గమకాండము

1. హెబ్రీ మగపిల్లను చంపమని రాజు ఆజ్ఞాపించిన హెబ్రీ మంత్రసానులు ఎవరు? (1 అధ్యా.)
2. మోషే కుమారుడు ఎవరు? ( 2 అధ్యా.)
3. తన పేరు ఏమని దేవుడు మోషేతో పర్వతముపై చెప్పెను? (3 అధ్యా.)
4. దేవుడు ఐగుప్తీయుల యెదుట చేయమని మోషేతో చెప్పిన మూడవ సూచక క్రియ ఏమిటి? (4 అధ్యా.)
5. హెబ్రీయులు ఐగుప్తుదేశమంతట ఎందుకు చెదరి పోయిరి? (5 అధ్యా.)
6. మోషే తల్లిదండ్రులు ఎవరు? (6 అధ్యా.)
7. మోషే ఫరోతో మాట్లాడినప్పుడు అతని వయస్సెంత? (7 అధ్యా.)
8. నాలుగవ తెగులు ఏమిటి? (8 అధ్యా.)
9. ఏడవ తెగులు వచ్చినప్పుడు ఏ పంటలు చెడగొట్టబడెను? (9 అధ్యా.)
10. ఫరో హృదయమును కఠినము చేసినది ఎవరు? (10 అధ్యా.)
11. ఆఖరి తెగులు ఏమిటి? (11 అధ్యా.)
12. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో ఎంతకాలము నివసించిరి? (12 అధ్యా.)
13. ఇశ్రాయేలీయులు ఏ నెలలో ఐగుప్తు దేశము నుండి బయలుదేరిరి? (13 అధ్యా.)
14. ఐగుప్తు దేశము నుండి బయలుదేరిన తర్వాత ఇశ్రాయేలీయులు ఎక్కడ దిగిరి? (14 అధ్యా.)
15. మారా అనగా ఏమిటి? (15 అధ్యా.)
16. మన్నాను ఒక్కొక్కరు ఎంత కూర్చుకొనవలెను? (16 అధ్యా.)
17. మస్సా అనగా ఏమిటి? (17 అధ్యా.)
18. మోషే రెండవ కుమారుని పేరేమి? (18 అధ్యా.)
19. ఐగుప్తు దేశము నుండి బయలుదేరిన తర్వాత మూడవ నెల ఆరంభదినమందు వారు ఏ అరణ్యములో ప్రవేశించిరి? (19 అధ్యా.)
20. ఎనిమిదవ ఆజ్ఞ ఏమిటి? (20 అధ్యా.)
21. తన తల్లినైనను తండ్రినైనను కొట్టువానికి విధించవలసిన శిక్ష ఏమిటి? (21 అధ్యా.)
22. శకునము చెప్పు దానికి విధించవలసిన శిక్ష ఏమిటి? (22 అధ్యా.)
23. సంవత్సరమునకు ఎన్నిమారులు పురుషులు ప్రభువైన యెహోవా సన్నిధిని కనబడవలెను? (23 అధ్యా.)
24. సీనాయి కొండను ఎన్ని దినములు మేఘము కమ్ముకొనియుండెను? (24 అధ్యా.)
25. దేవుడిచ్చు శాసనములను ఎక్కడ ఉంచమని మోషేకు ఆజ్ఞాపించెను? (25 అధ్యా.)

### బైబిల్ క్విజ్ - 02 జవాబులు

1.అహూజతు (26:26) 2.లాబాను (27:43) 3.బేతేలు (28:18) 4.14 సం॥లు (29:20,27) 5.దాను మరియు నఫ్తాలి (30:6,8) 6.రాహేలు (31:19) 7.పెనూయేలు (32:30)8. 400 మంది (33:1) 9.షిమ్యోను,లేవి (34:25)10.180 సం॥లు (35:28) 11.మహేతబేలు (36:39) 12. 20 తులముల వెండికి (37:28) 13.పెరెసు, జెరహు (38:29,30) 14.పోతీఫరుకు (39:1) 15.భక్ష్యకారుల అధిపతిని (40:22) 16.జప్నత్పనేహు (41:45) 17.పదిమంది (42:13) 18. బెన్యామీను (43:29) 19. యోసేపు యొక్క వెండి గిన్నె (44:2) 20. రెండు సం॥లు (45:6) 21.70 మంది (46:27) 22.17 సం॥లు (47:28) 23.మనష్షే, ఎఫ్రాయిము (48:1)24.మక్పేలా గుహలో (49:30,31) 25.110 సం॥లు (50:26)